APTEL 2009/31957
# నీలగిరి వార్త
మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com


స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు
2లో..

**రిపోర్టర్లు కావలెను**
తెలంగాణ, ఏపీ వ్యాప్తంగా 'నీలగిరి వార్త' దినపత్రి కలో పనిచేయడానికి రిపోర్టర్లు కావలెను. వివరాలకు 96765 49223 నంబర్‌లో సంప్రదించగలరు.
-ఎడిటర్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ | బుధవారం | 29 జులై 2026 | సంపుటి : 17 | సంచిక : 317 | పేజీలు : 12 | వెల : 5/-



## భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు
- లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

2లో..



## తుది దశకు చేరుకుంటున్న సర్
డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆలస్యం
2లో..



## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ అరెస్ట్
అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు
2లో..

## జగిత్యాల జీజీహెచ్‌కు స్పెషాలిటీ హబ్ హోదా
మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ప్రకటన
2లో..

# హైడ్రాను ఆపం!

- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పుడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి





**న్యూఢిల్లీ, నీలగిరివార్త :**
హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణపైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జా కోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం

మిగతా 2వ పేజీలో..



## అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం

- పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం
- గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే
- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఉపనేత కెటిఆర్

**న్యూఢిల్లీ, నీలగిరివార్త :**
మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త బిల్లులు తీసుకురావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా మూడుసార్లు జరిగాయని వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత, దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. డా. కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ

మిగతా 2వ పేజీలో..

## నీట్ అరెస్ట్‌లపై సుప్రీం కీలక ఆదేశాలు

- మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి
- విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :**
పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్ల లోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేర చరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీం కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్

మిగతా 2వ పేజీలో..

## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

- ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి
- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్దేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



**హైదరాబాద్, నీలగిరివార్త :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులుక్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే

మిగతా 2వ పేజీలో..

## అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

- ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చకున్న ఆస్ట్రాజెనెకా ఇండియా
- దేశంలోనే మొదటి ప్రెసిషన్ అంకాలజీ పరిశోధనకు ఒప్పందం
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న ఫార్మా సంస్థ



**అమరావతి, నీలగిరివార్త :**
కాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్య శాఖ- ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము కాన్సర్ రోగుల కోసం అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు

మిగతా 2వ పేజీలో..



## రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం
- వందఎపిసోడ్లు పూర్తి చేసుకున్న రైతునేస్తం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

2లో..


## హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

- ప్రజలు స్వాగతిస్తుంటే.. వీరు విమర్శిస్తున్నారు
- నీట్‌పై కేంద్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్, నీలగిరివార్త :**
హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ పక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఢిల్లీలో మకాం
రేవంత్, కెటిఆర్‌పై నిజామాబాద్ ఎంపి అర్వింద్ సెటైర్లు

**న్యూఢిల్లీ, నీలగిరివార్త :**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఈరోజు ఢిల్లీలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్,

మిగతా 2వ పేజీలో..

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ అరెస్ట్

**అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు**

**హైదరాబాద్, నీలగిరివార్త :** సహచర ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తరలించారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తును ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ బదిలీ చేశారు. అకాడమీలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# జగిత్యాల జీజీహెచ్‌కు స్పెషాలిటీ హబ్ హోదా

**మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ప్రకటన**



**హైదరాబాద్, నీలగిరివార్త :** జగిత్యాల జీజీహెచ్‌కు స్పెషాలిటీ హబ్ హోదా కల్పించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ప్రకటన చేశా రు. సచివాలయంలో జగిత్యాల జిల్లా వైద్య సేవలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని (జీజీహెచ్) అన్ని స్పెషాలిటీ వైద్య సేవలు అందించే కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక వసతులతో కొత్త ఆస్పత్రి భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జగిత్యాల మెడికల్ కాలేజీలో అన్ని పీజీ కోర్సులకు దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్ప త్రులకు త్వరలోనే స్పెషలిస్ట్ వైద్యులను నియమించనున్నట్లు వెల్లడిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టుల్లో ఇప్పటికే 1,182 నియామకాలు పూర్తయ్యాయని, గత రెండున్నరేళ్లలో ఆరోగ్య శాఖలో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యా లలో త్వరలో క్రిటికల్ కేర్ బ్లాక్‌తో పాటు ట్రామా కేర్ సేవలను అందు బాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్ ద్వారా జిల్లా ఆస్పత్రులకు నిరంతర ఔషధాల సరఫరా జరుగుతోందని, సిజేరియన్ డెలివరీలు తగ్గించి నార్మల్ డెలివరీలను ప్రోత్సహించేందుకు నర్సులకు మిడ్‌వైఫరీ శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** అంతర్జాతీయ, భౌగోళిక, రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం పసిడి ధరలు భారీ తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10గంటల సమయంలో హైదరాబాద్,విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,44,170గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ. 1690 మేర తగ్గింది.. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ. 1,32,150గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ. 1550 మేర తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు ఐదు వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ. 2,35,000గా ఉంది.


# తుది దశకు చేరుకుంటున్న సర్

**డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆలస్యం**

**హైదరాబాద్, నీలగిరివార్త :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గడువు సమీపిస్తుండగా ఇంకా స్పందించాల్సిన ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మిగిలిపోయిన వారి అడ్రస్‌లను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందితో సహా అందరూ ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణపై దృష్టి కేంద్రీకరించారు. గతంతో పోలిస్తే కొంత పరిస్థితి మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ.. ఇంకా ఎన్యుమరేషన్ పత్రాలు ఇవ్వాల్సిన వారు అధికంగానే ఉండటం గమనర్హం.వాటి అందజేతకు కొందరు నిరాకరిస్తుండగా.. మరికొందరు అందుబాటులో లేకపోవడంతో డిజిటలైజేషన్ ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఇంటి అడ్రసులు మారిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.వీరికి సమాచారం అందించి ఎన్యుమరేషన్ పత్రం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు.సర్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీన ముగుస్తుంది. కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంత తక్కువ వ్యవధిలో లక్షకు పైగా ఓటర్ల ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొని డిజిటలైజేషన్ చేయడం కష్టసాధ్యమనే చెప్పాలి. అందిన ఎన్యుమరేషన్ పత్రాలనుయాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక కేంద్రాల్లో ముమ్మరంగా కసరత్తు కొనసాగుతుంది. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీకి చెందిన వారు ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తమ స్వస్థలాల్లో ఓటు హక్కు ఉండేలా అక్కడే పత్రాలను ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఇటువంటి వారి నుంచి ఆయా ప్రాంతాల్లో ఓటరు నంబర్ తీసుకొని ఆ సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సర్‌లో భాగంగా వీరందరికి ఎన్యుమరేషన్ పత్రాలను జూన్ 25 వ తేదీన ప్రారంభించారు. ఈ క్రమంలో సర్ పక్రియ చివరి దశకు చేరుకుంది.

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు

మొదటిపేజీ తరువాయి..



సూచించారు. నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్-జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్-జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్**



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ హయాంలోనూ ఆర్‌ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్ర సింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషు లకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమా నాను రూ.కోటి నుంచి రూ. 10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల**



**హైదరాబాద్, నీలగిరివార్త :** రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు - శాస్త్రవేత్త - అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

# హైడ్రాను ఆపం!

మొదటిపేజీ తరువాయి..

చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం

మొదటిపేజీ తరువాయి..

పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. నిన్న హైకోర్టు హైడ్రా అనేది 9 తలల విష సర్పం అని చెప్పింది. ముఖ్యమంత్రి ఇంతకంటే చెంపపెట్టు ముఖ్యమంత్రికి ఏముంటుంది. సిగ్గుండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులతోపాటు పలు ఐటీ సంస్థల అంశాలను కేంద్రమంత్రితో చర్చించారు. అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావుతో కలిసి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బడాబాబులను మాత్రం వదిలిపెట్టి గరీబోళ్ల ఇండ్ల మీద పడి.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఇల్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెరువులో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర మంత్రులు వివేక్, శాసనమండలి చైర్మన్ గుత్తు సుఖేందర్ రెడ్డి, రాష్ట్రంలో ఇంకా కీలక నేతలు చాలా మంది బిల్డింగులన్నీ చెరువుల్లో, శిఖాల్లో ఉన్న వాటిని మాత్రం హైడ్రా ముట్టదని కేటీఆర్ అన్నారు. కబ్జాకోరులని ముఖ్యమంత్రి అంటున్నరు. అందరికంటే పెద్ద కబ్జాకోరులే మీ అన్నదమ్ములు కదా.. అందరికంటే ఎక్కువ ఆస్తి దోస్తున్నది.. అందరికంటే ఎక్కువ విధ్వంసం చేస్తున్నది మీ మంత్రులు కదా..? కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టింది నీ మంత్రులు కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయిన నాడు రాష్ట్రంలో నిషేధిత భూముల ఎంతంటే మొత్తం 16 లక్షల ఎకరాలు.. ఇవాళ అది కోటి ఎకరాలకు చేరుకుంది. ఏ కారణం చేత కోటి ఎకరాలు పెడుతున్నరు. 30 శాతం కమిషన్ తీసుకోవడం లేదా..? మీ మంత్రులు.. అని ప్రశ్నించారు. కబ్జాకోరులు, భూదందాలు చేసేది.. భూమిని భూహారతిలాగా మింగుతున్నది నీ ప్రభుత్వం, నీ మంత్రులు కాదా..? ప్రజలకు తెల్వదా? అని అన్నారు. హైడ్రా పేరుతో నువ్వు సృష్టిస్తున్న అరాచకం కొన్ని వేల ఇండ్లు హైదరాబాద్‌లో కూలగొట్టి ఒక ఇటుక పెట్టకుండా.. ఇల్లు కట్టకుండా విధ్వంసం సృష్టించి రియల్ ఎస్టేట్‌ను సృష్టించి నువ్వు డబ్బులు సొమ్ము చేసుకుంటున్నవ్ అంటూ మండిపడ్డారు.

పెద్ద పెద్ద బిల్డర్లు ఇవాళ చెరువుల్లో ఇండ్లు, బిల్డింగులు కడుతుంటే నీకు కనబడదు. కానీ ఇవాళ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నవ్. అందుకే మేమనేది హైడ్రా అనేది బ్లాక్‌మెయిలింగ్ ఎక్స్‌టార్షన్ టూల్ ఆఫ్ రేవంత్ రెడ్డి. అందుకే మా ప్రభుత్వం వచ్చిన మొదటి రోజే హైకోర్టు చెప్పిన విధంగా దాన్ని ఎత్తి బంగాళాఖాతంలో పడేస్తామన్నారు. ఒక అధికారి 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు చరిత్రలో ఎక్కడైనా ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సోదరుడి ఇల్లు, కాంగ్రెస్ నాయకుల ఫామ్ హౌసులు ఎందుకు కూలగొట్టడం లేదు..? చెప్పాలని డిమాండ్ చేశారు.

# నీట్ అరెస్ట్‌లపై సుప్రీం కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి..

సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు,దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని సూచించింది.

# రీ-సర్వే కీలక ఘట్టం

మొదటిపేజీ తరువాయి..

సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వేను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికో సారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికతతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు.

# అమరావతిలో జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

మొదటిపేజీ తరువాయి..

వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ-ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్, ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి కాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల కాన్సర్‌ను ముందుగా గుర్తించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఎక్స్ రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయనుంది. తద్వారా రోగులను వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటంతో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది. వైద్య రంగంలో పరిశోధనలకు క్వాంటంవ్యాలీ సేవలు ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని స్పష్టం చేశారు.

# తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఢిల్లీలో మకాం

మొదటిపేజీ తరువాయి..



రేవంత్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడంలో విజయవంతమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో విఫలమవడం వల్ల, తెలంగాణలో ప్రతి సంవత్సరం దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తుపై అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఆర్థిక భారం కారణంగా వందలాది కళాశాలలు కూడా మూసివేతకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్‌కు ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అవినీతిలో కూరుకుపోయిన కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి రుణభార ప్రాజెక్టులలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కుమ్మరించిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కే-కుటుంబం అపారమైన సంపదను కూడబెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు జెన్ జెడ్‌కు మద్దతుగా రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ మొసలి కన్నీళ్లు కార్చుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అత్యధిక నిరుద్యోగ రేటు ఉన్న రెండు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఎంపీ అన్నారు. దాదాపు 13 ఏళ్లుగా ఉద్యోగాల క్యాలెండర్‌ను నిలిపివేసినందుకు రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలంటూ సెటైర్ విసిరారు. తెలంగాణకు ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ, స్వచ్ఛమైన పాలన ఉన్న ప్రభుత్వం కావాలన్నారు. అందుకే తెలంగాణ.. బీజేపీకి సిద్ధంగా ఉందని గట్టిగా నమ్ముతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

# డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభం.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త




డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026--27 విద్యా సంవత్సరానికి బి.ఏ., బి.కాం., బి.ఎస్సి డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు వరంగల్ ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, 10o2 అర్హత కలిగిన విద్యార్థులతో పాటు రెండేళ్ల పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.

ప్రవేశాల కోసం ఆధార్ కార్డు, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం (అవసరమైన వారికి), పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రవేశాలకు ఆగస్టు 7 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఓఓఓ.ఎత్మిశీబశీఅశ్రీఱఅవ.ఱఅ వెబ్‌సైట్‌లో ప్రవేశ నమోదు పూర్తి చేసి, తాము ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రంలో సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-0101, ఫోన్ నంబర్లు 040-23680333, 040-23680444, 040-23680555లను సంప్రదించాలని ప్రొఫెసర్ సుంకరి జ్యోతి కోరారు.

# న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేసిన.






వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి.
రహదారి మౌలిక వసతుల బలోపేతానికి కేంద్ర సహకారం కోరిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని కరుణాపురం నుండి పెద్ద పెండ్యాల, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, ధర్మసాగర్ మండల హెడ్‌క్వార్టర్, దేవునూర్, సోమ దేవరపల్లి, దామెర, ఎల్కతుర్తి మండల హెడ్‌క్వార్టర్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఈ రోడ్డు హైదరాబాద్ నుండి కరీంనగర్, సిద్ధి పేటకు వెళ్లే వాహనాలు వరంగల్ వెళ్లే అవసరం లేకుండా 163, 563 జాతీయ రహదారులను అనుసంధానించే కీలక మార్గమని, వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు నిత్యం వినియోగిస్తున్నారని వివరించారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే యాదాద్రి--వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163) నాలుగు లైన్ల విస్తరణ సమయంలో పలు గ్రామాల్లో నిర్మించిన సర్వీస్ రోడ్ల మధ్య మిగిలిపోయిన లింకులను పూర్తి చేయాలని కోరారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు ఉన్నప్పటికీ వాటి మధ్య అనుసంధానం లేకపోవడంతో స్థానిక ప్రజలు ప్రధాన రహదారినే వినియోగించాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని వివరించారు. అవసరమైన భూమి ఇప్పటికే సేకరించిన నేపథ్యంలో మిగిలిన లింకుల నిర్మాణానికి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా కేంద్ర రోడ్డు మరియు మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) 2025--26 కింద తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన అదనపు రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని కోరారు. నర్సంపేట--నందిగామ రహదారి విస్తరణ,

భట్టుపల్లి--హంటర్ రోడ్ మార్గ అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలైతే గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక అవసరాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

# బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్రప్రసాద్ ను సత్కరించిన.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



రంగశాయిపేట లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్రప్రసాద్ చే నిర్వహించబడుతున్న శ్రీదేవి భాగవత పురాణ ప్రవచనముల కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని ఆలకించాలని 42 వడివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ కోరారు. మంగళవారం రోజున రంగశాయిపేట లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రవచనాలు నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్రప్రసాద్ ని తాజా మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, ప్రవచనాలు బోధించడానికి రంగశాయిపేటకు విచ్చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ రంగశాయిపేటలోని భక్తులందరిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించాలన్న సంకల్పంతో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీ వెళిదే ప్రదీప్ శర్మ, ఆలయ చైర్మన్ ముత్తినేని రామమూర్తి ల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్రప్రసాద్ చే శ్రీదేవి భాగవత పురాణ ప్రవచనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ఈ ప్రవచనాలు 26వ తేదీ ఆదివారం రోజు నుండి 1వ తేదీ శనివారం రోజు వరకు ప్రతిరోజు సాయంత్రం 5:00 గంటల నుండి 7:30 గంటల వరకు బోధిస్తున్నారని తెలిపారు. కావున భక్తులంతా ఈ ప్రవచనాల కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేద బ్రాహ్మణులు శ్రీ వెళిదే ప్రభాకర శాస్త్రి, ఆలయ అర్చకులు గంగు రాజేందర్ శర్మ, రామాలయం ధర్మకర్త ఆవునూరి కుమార్, మేరవాడ శివాలయం ధర్మకర్త పాలకుర్తి సుమన్ గౌడ్, ఈగ విజయలక్ష్మి లతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా.
## డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు నియామకం.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.




తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ సంస్థాగత విస్తరణలో భాగంగా.., టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రేటర్ వరంగల్, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు నూతన జిల్లా అధ్యక్షులను నియమిస్తూ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావును నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి నియామక పత్రాన్ని విడుదల చేశారు. గ్రేటర్ వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 66 డివిజన్లలో పార్టీ కార్యకలాపాలను డాక్టర్ వెంకటేశ్వర్ రావు పర్యవేక్షించనున్నారు.

నియామక ఉత్తర్వులు వెలువడిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత కల్వకుంట్ల కవితకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను గ్రామ గ్రామాన, డివిజన్ డివిజన్‌లో ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లలో విజయాన్ని సాధించి, మెజార్టీ సీట్లను గెలుచుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని డాక్టర్ వెంకటేశ్వర్ రావు స్పష్టం చేశారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రేటర్ వరంగల్‌లో బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ విస్తరణకు కృషి చేస్తూ, అధికారమే లక్ష్యంగా -పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి కావడమే ధ్యేయంగా పార్టీ శ్రేణులతో కలిసి నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో గ్రేటర్ వరంగల్ జిల్లాలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని, నూతన నాయకత్వంలో పార్టీ సంస్థాగతంగా బలోపేతమై రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# కాశిబుగ్గ ఓసిటి జంక్షన్‌లో సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపెల్లి జయశంకర్ సార్.

92వ జన్మదిన సందర్భంగా ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు వరంగల్ కాశిబుగ్గ ఓసిటి జంక్షన్లో టి.జేఏసీ నాయకులు ఆకెన వెంకటేశ్వర్లు అధ్యక్షతన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జన్మదిన సందర్భంగా ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్ను ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ కొణతం కృష్ణ గారు ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఆగస్టు ఆరో తేదీన కాకతీయ యూనివర్సిటీ ాణూజజు మహిళ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్ లో జరిగే జయంతి ఉత్సవాలకులి, తెలంగాణ వాదులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, మేధావులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంలో టి.జేఏసీ నాయకులు పెరుమాండ్ల లక్ష్మణ్, గంగుల దయాకర్, టి.ఎన్. స్వామి, గంజి సాంబయ్య, మార్తా ఆంజనేయులు, అమృత బిక్షపతి, వెంకటస్వామి, వెంగళ సురేష్, జంగం రాజనర్సు, మడిపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో గద్దల రాజ్యం




## రామారెడ్డి సర్వసభ్య సమావేశంలో సర్కార్ తీరుపై సర్పంచ్‌ల నిప్పులు

**సర్పంచ్‌లను లెక్కచేయని అధికారుల అహంభావం**

**- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై అధికారుల ఉదాసీనత**

**- మొక్కుబడిగా సాగిన మీటింగ్.. ఖాళీ కుర్చీలతోనే సరి!**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

ప్రజల సమస్యలు పరిష్కారం కావాల్సిన ప్రజాస్వామ్య వేదిక. అధికారుల నిర్లక్ష్యంతో రణరంగంగా మారింది. రామారెడ్డి మండల కేంద్రంలో మంగళ వారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అట్టడుగు ప్రజాప్రతినిధుల ఆగ్రహాగ్నితో వేడెక్కింది. గ్రామాల అభివృద్ధికి పట్టుకొమ్మలైన సర్పంచ్‌లను కనీసం లెక్కచేయకుండా, కనీస సమాచారం కూడా ఇవ్వకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడంపై ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాకే దిక్కులేదు.. ఇక ప్రజల గోస ఎవరికి చెప్పుకోవాలి? మండలంలో అత్యంత కీలకమైన సర్వసభ్య సమావేశానికి పలువురు మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడం సర్పంచ్‌ల్లో ఆగ్రహం కట్టలు తెంచుకునేలా చేసింది. సమావేశం జరుగుతున్న తీరుపై సర్పంచ్‌లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిలదీశారు. ప్రజాప్రతినిధులమైన మాకే సమాచారం ఇవ్వకుండా, కనీస మర్యాద ఇవ్వకుండా మీ ఇష్టానుసారంగా సమావేశాలు పెడితే ఎలా? మా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి? అధికారు లారా.. మీ తీరు మరువకండి, ప్రజలు మిమ్మల్ని క్షమించరు!" అంటూ సర్పంచ్‌లు గట్టిగా నిలదీశారు. ?ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సందిగ్ధత ?ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక వ్యవహారంపై సమావేశంలో తీవ్ర గందరగోళం చెలరేగింది.? లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత ప్రత్యేక కమిటీలదా? లేక క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ఉండే పంచాయతీ పాలకవర్గాలదా? అని సర్పంచ్‌లు అధికారులను సూటిగా ప్రశ్నించారు. దీనిపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో, ప్రభుత్వ పథకాలను కూడా నీరుగారుస్తున్నారని సర్పంచ్ లు మండిపడ్డారు. మొక్కుబడిగా సాగిన అజెండా, ?సర్పంచ్‌ల ఆగ్రహం మధ్యే మొక్కుబడిగా సాగిన ఈ సమావేశంలో అధికారులు పలు సాధారణ సూచనలు చేశారు. వ్యవసాయం రైతులు అన్న దాతలుగా నష్టపోకుండా ఆరుతడి పంటల సాగు పై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంట్లోనూ తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నిబంధనల ప్రకారం కొలతలను బట్టి ప్రభుత్వ ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో వేలాడుతున్న కరెంట్ వైర్లు, ప్రమాదకర పరిస్థితులు ఉంటే వెంటనే ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్, హౌసింగ్ డీఈ సుభాష్, ఏఈ శ్రీజ, తహశీల్దార్ ఉమలత, ఏవో భాను శ్రీ, ఎంపీవో తిరుపతి రెడ్డి, ఆర్ఐ నరేష్, ఏపీవో ధర్మారెడ్డి, ఏపీఎం పద్మా వతి, ట్రాన్స్‌కో ఏఈ సుధాకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కేయూ వీసీ ప్రతాప్ రెడ్డికి గుండెపోటు.

ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడ డాక్టర్ల ప్రత్యేక పర్యవేక్షణ చికిత్స.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి కర్నాటి ప్రతాప్ రెడ్డి మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (గుండెపోటు) కు గురయ్యారు. దీంతో హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు యాంజియోగ్రామ్తో పాటు ఇతర గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి స్టంట్ అమర్చినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

# వరంగల్ జిల్లా ప్రత్యేక ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహానికి.

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పార్లమెంట్ లో ప్రశ్నించిన. వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



వరంగల్ జిల్లా ప్రత్యేక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు, ఎగుమతుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ప్రధానంగా వరంగల్ నుంచి చేనేత, వస్త్ర ఉత్పత్తులు, వ్యవసాయ, ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి? ఎగుమతిదారులకు అందించిన ఆర్థిక సహాయం, మార్కెటింగ్ మద్దతు, నాణ్యత ధ్రువీకరణ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశానికి చేపట్టిన కార్యక్రమాలు ఏమిటి? అని లోక్‌సభలో ప్రశ్న లేవనెత్తారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద వరంగల్ ఉత్పత్తులకు ఎగుమతుల పరంగా విశేష అవకాశాలు ఉన్నాయని లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. డిస్ట్రిక్ట్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్స్ కార్యక్రమం కింద వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల్లో టెక్స్‌టైల్స్, వరంగల్ చేనేత తివాచీలు, గార్మెంట్లు, మామిడి, బియ్యం, మొక్కజొన్నలను ఎగుమతి సామర్థ్యం కలిగిన ప్రధాన ఉత్పత్తులుగా గుర్తించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఎగుమతుల వృద్ధికి రూ. 25,060 కోట్లతో కేంద్ర ప్రభుత్వం 'ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్'ను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. వాణిజ్య రుణాలు, వడ్డీ రాయితీలు, క్రెడిట్ గ్యారంటీలు, నాణ్యత ప్రమాణాలు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, అంతర్జాతీయ మార్కెట్ యాక్సెస్ వంటి అంశాల్లో ఎగుమతిదారులకు మద్దతు అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. వరంగల్ రైతులు, చేనేత కార్మికులు, చిన్న పరిశ్రమలకు ప్రపంచ మార్కెట్లలో అవకాశాలు పెరిగేలా పార్లమెంట్ వేదికగా నిరంతరం తన గళం వినిపిస్తానని పేర్కొన్నారు.

# నాసిరకంగా సిమెంట్ రోడ్డు

- నిర్మాణం చేసిన నెలకే పగుళ్లు

**తాండూరు, జూలై 28:**



సిమెంట్ రోడ్డు నాసిరకంగా నిర్మాణం చేపట్టారు. రోడ్డు నిర్మాణం చేసిన నెలకే పగుళ్లు వచ్చాయి. తాండూరు మండలం బెల్కటూరు గ్రామంలోని ఎస్సి కాలనిలో మున్నూరు శివ ఇంట్టి నుండి చెంద్రయ్య ఇంటి వరకు రూ. 5 లక్షలు ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో గత ఏడాది రోడ్డు వేశారు. నాసిరకం రోడ్డు నిర్మాణం చెపట్టడంతో రోడ్డు పగుళ్లు తెలి అధ్యానంగా మారింది. అధికారులు రోడ్డును పరిశీలన చేసి కాంట్రాక్టర్కు నిధులు ఇవ్వకూడదని సూచించారు. అయితే ఇటీవల ఎన్ ఆర్ జి ఎస్ నిధులు విడుదల కావడంతో రోడ్డు నిధుల కోసం కాంట్రాక్టర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈలాంటి రోడ్డు చేపడితే నిధులు ఎలా ఇస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉన్నతధికారులు స్పందించి రోడ్డు మళ్లీ వేయించాలని గ్రామ ప్రజలు కోరతున్నారుపగిలిన సిమెంట్ రోడ్డుపగుళ్లతో సిమెంట్ రోడ్డు

# కాలభైరవుని దర్శించుకున్న మహిళలు

బండరాయికి చెక్కబడిన కాలభైరవుని చిత్రం

వందల సంవత్సరాలుగా శిథిలావస్థలో కాలభైరవుడు


గుర్తించి మామిడి తోరణాలు చలవ పందిర్లతో పూజలు

పూల తో అభిషేకాలు కాలభైరవుని దర్శించుకుంటే

సమస్త సమస్యలు మాయం

మహిమానితమైనటువంటి కాలభైరవుడు

భారీగా హాజరైన మహిళలు ప్రత్యేక పూజలు





దేవరకొండ నీలగిరి వార్త

దేవరకొండ పట్టణం లోని పర్వత రావు చెరువు మార్గంలో ఉన్న కాలభైరవుని మంగళవారం స్థానిక మహిళలు పెద్ద ఎత్తున హాజరై కాలభైరవుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లా దుర్గం వెనకవైపున దుర్గం నిర్మాణంలోని కాలభైరవుని నిర్మించినట్లు తెలుస్తుందని తెలిపారు. ఇటీవల కొంతమంది యువకులు కాలభైరవుని గుర్తించి చలవ పందిర్లు మామిడి తోరణాలు రంగులు వేయడం పరిసరాలను పరిశుభ్రం చేయడం జరిగిందని తెలిపారు. ఎంతో మహిమాన్వితమైనటు వంటి కాలభైరవుని దేవాలయం భవిష్యత్తులో ప్రసిద్ధి ఎక్కాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో

## ఘనంగా సహకార విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

### 15 ఏళ్ల తర్వాత పూర్వ మిత్రులు ఒకే వేదికపై




ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి, జూలై 28:

ఉమ్మడి ఖమ్మం జిల్లా సహకార విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఖమ్మం నగరంలోని గ్రాండ్ గాయత్రి హోటల్ లో ఘనంగా జరిగింది. 15 ఏళ్ల తరువాత పూర్వ విశ్రాంత ఉద్యోగులు ఒకచోట కలుసుకొని విధి నిర్వహణలో ఉన్నప్పుడు వారు చేసిన ఉద్యోగ బాధ్యతలను, సేవలను, తీపి గుర్తులను, జ్ఞాపకాలను, గుర్తు చేసుకుంటూ ఆడి పాడి అలరిస్తూ నెమరేసుకున్నారు. పదవి విరమణ పొందిన తర్వాత అందరూ ఎక్కడెక్కడికో వెళ్లి స్థిరపడ్డారు, ఎన్నోసార్లు కలుద్దామనుకున్న ఎవరు అందుబాటులో లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల్లో, జిల్లాలలో ఉండడం వలన కలవలేకపోయారు. కానీ ఏదో ఒకరోజు పూర్వ ఉద్యోగులను ఖచ్చితంగా కలవాలనే తపనతో ఉన్నవారికి ఆదివారం గ్రాండ్ గాయత్రి హోటల్ వేదికగా మారింది. ఈ కార్యక్రమానికి బాధ్యులుగా వ్యవహరించిన కెవెస్ గోపాల్, కాశబోయిన అనంతరాములు ను తోటి మిత్రులు ఘనంగా సత్కరించి, సన్మానించి అభినందించారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారి శాకంబరి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా 14వ రోజు.

ముద్ర జ్వాలమాలిని రూపాల్లో అలంకరణ దర్శనం.

శ్రీ లక్ష్మి శ్రీనివాస్ సేవా సమితి మహబూబాబాద్ ఆధ్వర్యంలో.

శాకాంబరి అలంకరణ కొరకు 11 క్వింటాళ్లు కూరగాయలు.







వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు 14వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గం॥ 05-00లకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట తిథి మండల దేవతా యజనంలో భాగంగా కాళీ క్రమాన్ననుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని ముద్రా గాను షోడశీ క్రమాన్ననుసరించి జ్ఞానశక్తిని జ్వాలామాలినీ గాను అలంకరించి పూజారాధనలు జరిపారు. ముదం లాతీతి ముద్రా, చతుర్దశి తిథికి అధిదేవతయైన అమ్మవారి యొక్క ఒక్క విభూతి భద్రకాళీ అమ్మవారి భక్తులకు సంతోషాన్ని ప్రసాదిస్తుంది. మనిషికి కోరిన కోర్కెలు నెరవేరినపుడు సంతోషం కలుగుతుంది. అంటే ఆ అమ్మవారు భద్రకాళీ అమ్మవారి యొక్క భక్తుల కోరిన కోర్కెలను నెరవేర్చి అమితమైన సంతోషాన్ని కలిగిస్తుంది కాబట్టి శాస్త్రములు అట్టి అమ్మవారిని ముద్రా అని కీర్తించాయి. మంగళవారం శ్రీ లక్ష్మీ శ్రీనివాస సేవా సమితి, మహబూబాబాద్ జి.కె. రెడ్డి ఆధ్వర్యంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత కి తమ సేవాసమితి సభ్యులు సుమారు 11 క్వింటాళ్ళ కూరగాయలు అమ్మవారికి సమర్పించారు. దివి: 29-07-2026 బుధవారం తెల్లవారుజామున గం॥ 03-00ల నుండి నిత్యాహిరం నిర్వర్తింపు డిన అనంతరం అమ్మవారికి పలువిధములైన కూరగాయలు, పండ్లతో శాకంభరీ అలంకారము ప్రారంభమగును. ఇట్టి అలంకారము ఉదయం గం॥ 09-00ల వరకు జరుగును, అలంకారము జరుపుచున్న సందర్భములో భక్తులు అమ్మవారిని దర్శించుకొనుట వీలుపడదు. అమ్మవారి అలంకారమునకు సుమారు 6 గంటల వ్యవధి పట్టును. అలంకారము జరుపబడిన పిమ్మట ఉదయం గం॥ 09-00ల

నుండిసర్వదర్శనమునకు భక్తులు అనుమతింపబడతారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనముతో పాటు విశిష్ట దర్శనం అతిశీఘ్రదర్శనం. ధర్మదర్శనం క్యూలైన్లు యధాపూర్వం ఏర్పాటు చేయడమైనది. దివి: 29-07-2026 బుధవారం రోజున ఉదయం గం॥ 09-00ల నుండి మాత్రమే భక్తులకు శ్రీ భద్రకాళి అమ్మవారి శాకంభరీ విశ్వరూప దర్శనం ప్రారంభమై రాత్రి వరకు ఉండును. ఈ సందర్భంగా భక్తుల రాకను పురస్కరించుకొని చేయవలసిన భద్రతా తదితర ఏర్పాట్లు ప్రభుత్వ శాఖల నుండి జరుపబడ్డాయి.

సార్ తప్పకుండా అన్ని ఫోటోలతో ఐటం వాడండి

## జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడుగా ఎర్ర భిక్షపతి ఎన్నిక

తన నిమకానికి సహకరించిన నల్గొండ బిజెపి అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డికి కృతజ్ఞతలు

పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తా ఎర్ర బిక్షపతి నల్లగొండ బిజెపి కార్యవర్గ సభ్యుడు

దేవరకొండ నీలగిరి వార్త



సామాన్య కార్యకర్త నేడు జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులుగా నియామకం ఇది అసమాన్యమైన విషయం కాదు దాని వెనక ఎంతో కష్టం ఉంది .గ్రామీణ ప్రాంతాల నుండి దళిత వర్గాలకు చెందిన ఒక సామాన్య కార్యకర్త అతి కొద్ది కాలంలోనే జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక కావడం వెనక ఎంతో శ్రమ అంకితభావం క్రమశిక్షణ పార్టీ కి విధేయుడుగా పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు అనడంలో అతియోక్తి లేదు. దేవరకొండ మండలంలోని కొండ భీమనపల్లి గ్రామానికి చెందిన ఎర్ర బిక్షపతి చిన్నతనం నుండి స్వయంసేవక్ ,ఏబీవీపీ కార్యకర్తగా అంచలంచలుగా తన పనితీరుకు నిదర్శనంగా పనిచేస్తూనే బిజెపిలో చేరి వార్డు సభ్యుడుగా సైతం పార్టీ టికెట్ పై పోటీ చేసి కొన్ని అనివార్య కారణాలవల్ల ఓడిపోయినప్పటికీ పార్టీని బలంగా నమ్ముకొంటూ ప్రజల కష్టాలను తీర్చడం కోసం అనునిత్యం కష్టపడుతూ కొండ భీమనపల్లిలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. దీనిని గుర్తించిన నల్గొండ జిల్లా పార్టీ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియామక చేయడం పట్ల కొండ భీమనపల్లి పట్టణ శాఖ సభ్యులు సైతం బిక్షపతికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత కేసు నమోదు

దేవరకొండ నీలగిరి వార్త



దేవరకొండ మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. తాటికోల్ వాగు శివారు తండాల నుంచి ఇసుకను నిల్వ చేసి తరలిస్తుండగా సీఐ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక కావాల్సిన వారు ప్రభుత్వానికి చెందిన 'మన ఇసుక వాహనం' పోర్టల్‌తో బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా నేరమని అక్రమంగా ఇసుకను తరలిస్తే పట్టుబడితే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## జర్నలిస్ట్ పాసులపై టోల్ టాక్స్, సెస్సులు తొలగించండి

వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా నేతల డిమాండ్

టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎంకు వినతి పత్రం అందజేత

ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి జూలై 28:



వర్కింగ్ జర్నలిస్టుల స్టేట్ కన్సెషన్ పాసులపై టీజీఎస్ ఆర్టీసీ అదనంగా వసూలు చేస్తున్న టోల్ టాక్స్, సెస్సులను వెంటనే తొలగించాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) డిమాండ్ చేసింది. నిబంధనల మేరకు బేసిక్ చార్జీల్లో 1/3 (సుమారు 33.3%) మాత్రమే వసూలు చేయాల్సి వుండగా, టోల్ టాక్స్, సెస్సులు కలిపి 50 నుండి 60 శాతం వరకూ ఛార్జీలు వసూలు చేయడం సరైంది కాదని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కోకన్వీనర్లు యెన్నెబోయిన శ్రీనివాస రావు, నాగరాజు దేవర, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్, ప్రెస్ క్లబ్ ఇంచార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబ రావు, గోగుల నారాయణ రావు, కె. ప్రసాద రావు, ఏనిగండ్ల శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్, సీనియర్ జర్నలిస్ట్ ఆరిక కిరణ్ కుమార్ తదితరులు తెలంగాణ ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ ఏ. సరి రామ్ కు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల స్టేట్ కన్సెషన్ పాసులపై అదనంగా విధిస్తున్న టోల్ టాక్స్, సెస్సుల వల్ల జర్నలిస్టులు ఆర్థిక భారానికి గురవుతున్నారని యూనియన్ ప్రతినిధులు ఈ సందర్భంగా ఆర్.ఎం దృష్టికి తెచ్చారు. విధుల్లో భాగంగా నిత్యం ప్రయాణాలు చేయాల్సిన జర్నలిస్టులకు ఈ రకమైన అదనపు వసూళ్లు మానసిక, ఆర్థిక ఆందోళనను కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ అదనపు భారాన్ని ఏ రూపంలో వసూలు చేసినా, తక్షణమే రద్దు చేయాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంబమైన మీడియా రంగానికి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం, రవాణా సౌలభ్యం కోసం ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ రవాణా చార్జీల్లలో రాయితీలను ఇస్తోందని గుర్తు చేశారు. ఆయితే, ఇప్పుడు స్టేట్ కన్సెషన్ పాసులపై ఆర్టీసీ అదనంగా వసూల చేస్తున్న టోల్ టాక్స్, సెస్సుల వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతోందని పేర్కొన్నారు. వెంటనే కార్పొరేషన్ ఈ రకమైన అదనపు వసూళ్లకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు. డబ్ల్యూజేఐ ప్రతినిధుల విజ్ఞప్తిపై స్పందించిన రీజనల్ మేనేజర్ ఏ. సరి రామ్, ఈ సమస్యను ప్రభుత్వం, కార్పొరేషన్ పెద్దల దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఇది రీజనల్ స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్య కాదని, రాష్ట్ర స్థాయిలోనే నిర్ణయం తీసుకోవాల్సి వుంటుందన్నారు.

డబ్ల్యూజేఐ ప్రతినిధులు ఇచ్చిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. అనంతరం, ఖమ్మం నుండి కోదాడ, కోదాడ నుండి ఖమ్మానికి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఒక ఆర్డినరీ బస్సును నడపాలని డబ్ల్యూజేఐ ప్రతినిధులు ఆర్.ఎంను కోరారు. ఆ సమయంలో ఆర్డినరీ సర్వీస్ లేక పోవడం వల్ల, ఆ రహదారిలోని వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన జర్నలిస్టులతో పాటు, ప్రయాణీకులు కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై కూడా సానుకూలంగా స్పందించిన రీజనల్ మేనేజర్ ఏ. సరి రామ్ తగిన చర్యలు తీసుకుంటామని డబ్ల్యూజేఐ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

## ఎక్సైజ్ సంయుక్త దాడులు నాటు సారా పట్టివేత అరెస్ట్ కేసు నమోదు

దేవరకొండ నీలగిరి వార్త



నల్గొండ డిపి ఈ ఓ ఆదేశాల మేరకు, దేవరకొండ ఎస్ హెచ్ ఓ నల్గొండ ఎస్.హెచ్.ఓ మరియు నాంపల్లి ఎస్ హెచ్ ఓ లతో కలిసి, దేవరకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ క్రింది ప్రాంతాలలో సంయుక్తంగా నాటు సారా దాడులు నిర్వహించడం జరిగింది. జరుగుతున్నట్లు దేవరకొండ సీఐ శ్రీనివాస్ తెలిపారు.మేగ్య తండాపన్ని తండా అమ్గోత్ తండాకేశ్య తండా మర్రిచెట్టు తండాఈ దాడుల సమయంలో ఈ క్రింది కేసులు గుర్తించబడ్డాయికేసు వివరాలునమోదు చేయబడిన కేసుల సంఖ్య 04 అరెస్టు చేయబడిన వ్యక్తుల సంఖ్య 02స్వాధీనం చేసుకున్న నాటు సారా పరిమాణం 04 లీటర్లు అక్కడికక్కడే ధ్వంసం చేసిన బెల్లం ఊట 600 లీటర్లు స్వాధీనం చేసుకున్న నల్ల బెల్లం పరిమాణం 180 కిలోలుస్వాధీనం చేసుకున్న పటిక పరిమాణం 40 కిలోల బైండోవర్ చేయబడిన వ్యక్తుల సంఖ్య 03 అని తెలిపారు.

## పార్కులు, గ్రాండ్ ఎంట్రెన్స్‌లు నగర ప్రతిష్ఠను ప్రతిబింబించాలి.

కమిషనర్ టి. వెంకన్న.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



పార్కులు, గ్రాండ్ ఎంట్రెన్స్‌లు నగర ప్రతిష్ఠను ప్రతిబింబించాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో నగరంలోని హార్టికల్చర్ విభాగం పరిధిలోని పార్కులు, సెంట్రల్ మీడియన్లు, నర్సరీలు, గ్రాండ్ ఎంట్రెన్స్‌ల వద్ద చేపడుతున్న సుందరీకరణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. మొదట పబ్లిక్ గార్డెన్స్‌ను సందర్శించిన కమిషనర్ అక్కడ మొక్కల నిర్వహణ తీరును పరిశీలించారు. పార్కులో కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ, నడక మార్గాల వెంట ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పార్కులను సందర్శించే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచిస్తూ నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

అనంతరం ఎల్లాపూర్‌లో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవం సందర్భంగా పంపిణీ చేసేందుకు పెంచుతున్న మొక్కల వివరాలను హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి వద్ద తెలుసుకున్నారు. నర్సరీలో అన్ని రకాల మొక్కలను ఆరోగ్యవంతంగా పెంచి, వనమహోత్సవ కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

తదుపరి ఎల్లాపూర్ కరీంనగర్ గ్రాండ్ ఎంట్రెన్స్ వద్ద చేపడుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. ప్రవేశ ద్వారం నగరానికి ప్రతీకగా నిలిచేలా, ఆకర్షణీయమైన అలంకార మొక్కలు, పూల మొక్కలతో అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించేలా హరిత వాతావరణాన్ని మరింత అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

హసన్‌పర్తి అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రం వద్ద కొత్తగా అభివృద్ధి చేసిన గ్రీనరీ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ అక్కడ మొక్కలు నాటారు. అనంతరం ఆరేపల్లి వద్ద ములుగు గ్రాండ్ ఎంట్రెన్స్‌ను సందర్శించి సుందరికారణ పనులను పరిశీలించారు. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించడం

, మొక్కలకు అవసరమైన కత్తిరింపులు చేపట్టడం,

పచ్చదనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం ద్వారా నగర సౌందర్యాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని అన్ని పార్కులు, సెంట్రల్ మీడియన్లు, నర్సరీలు, గ్రాండ్ ఎంట్రెన్స్‌ల నిర్వహణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, హరితీకరణ పనుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్,

ఏఈ వరుణ్, హార్టికల్చర్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్టార్మ్ వాటర్ డ్రెయిన్ డీపీఆర్‌ను వేగవంతంగా పూర్తి చేయాలి.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



గ్రేటర్ వరంగల్ నగరంలో ప్రతిపాదిత స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన పనులను నాణ్యతా ప్రమాణాలతో, శాస్త్రీయంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, ఇంజినీరింగ్ అధికారులతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ డీపీఆర్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, నగరంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందించేలా డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వ, వరద ముంపు సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి, సహజ వాగులు, నాలాలు, నీటి ప్రవాహ మార్గాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా డీపీఆర్‌ను రూపొందించాలని, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. నగర భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన వర్షపు నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవికుమార్, సంతోష్ బాబు, సంజయ్ కుమార్, మాధవీలత, మహేందర్ తదితర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే




**తాండూరు, జూలై 28**

: తాండూరు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారంపై తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గ్రామాల్లో, పట్టణాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించే చర్యలు చేపట్టడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.వ్యవసాయ అవసరాల కోసం రైతులకు నిర్ణీత సమయాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని, అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి.గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు ప్రమాదకరంగా మారిన లూజు విద్యుత్ వైర్లను గుర్తించి

పకడ్బందీగా సరిచేయాలని ఆదేశించారు.నియోజకవర్గంలోని అన్ని సబ్‌స్టేషన్లను అవసరమైన మరమ్మతులు చేపట్టి, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యుత్ కనెక్షన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతులు రూ.9,100 ప్రభుత్వానికి చెల్లిస్తే ఒక కిలోమీటరు వరకు విద్యుత్ వైరు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఈ పథకాన్ని అర్హులైన రైతులు వినియోగించుకోవాలని కోరారు.విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, విద్యుత్ అంతరాయాలు మరియు అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

అదేవిధంగా

, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ రవి ప్రసాద్ ,డి ఈ సూర్య నాయక్ , ఎ డి శంకర్ నాయక్ , అన్ని మండలాల ఎ ఈ లు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, కౌన్సిలర్ లు, నాయకులు పాల్గొన్నారు.విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిఎమ్మెల్యే ను సన్మానం చేస్తున్న విద్యుత్ అధికారులు

# వర్షాకాలంలో విస్తృతంగా మొక్కల నాటిన మౌలాలి సర్కిల్ అధికారులు

**మల్కాజ్గిరి నీలగిరి వార్త**



వర్షాకాలాన్ని పురస్కరించుకుని మౌలాలి సర్కిల్ పరిధిలోని ఎస్‌సీపీ నేరేడ్మెట్, మౌలాలి ప్రాంతాల్లో కమిషనర్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మౌలాలి సర్కిల్ డీసీ, ఏడీ, యూబీడీ, శానిటేషన్ సిబ్బంది, రామ్‌కీ సంస్థ ప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. వర్షాకాలంలో నాటిన మొక్కలను కాపాడితే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.

# శాస్త్రీయ పద్ధతుల్లో పంట సాగు చేపట్టాలి

**- రైతులకు సూచించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**




తాండూరు,జూలై 28 :శాస్త్రీయ పద్ధతుల్లో పంట సాగు చేపట్టాలని రైతులకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సూచించారు.

మంగళవారం తాండూరు మండలం అంతారం రైతువేదికలో "రైతు నేస్తం 100వ ఎపిసోడ్" కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో రైతులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ

తాండూరు నియోజకవర్గంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, రైతుల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.తక్కువ నీటితో అధిక దిగుబడులు అందించే పంటలను సాగు చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు మంత్రి, ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.అనంతరం ఆదర్శ రైతులకు ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ వెంకటయ్య , ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి , డిఏఓ కవిత , ఏడిఏ అరుణ , ఎ ఓ కొమరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రాజ్ కుమార్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ,ఏఈఓ సుమ , పలువురు సర్పంచ్ లు, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# క్లౌడ్ ఫోటోగ్రాఫర్ యూనుస్ ఫర్హాన్ సృజనాత్మకతను అభినందించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కే.వి. రమణ చారి

**దేవరకొండ నీలగిరి వార్త**



ఆకాశంలోని నైసర్గిక ఆకృతులను అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరిస్తూ, పర్యావరణ స్పృహను ఆధ్యాత్మికతను మేళవించి సమాజానికి దిశా నిర్దేశం చేస్తున్న ప్రముఖ క్లౌడ్ ఫోటోగ్రాఫర్ యూనుస్ ఫర్హాన్ తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కే.వి. రమణ చారి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

యూనుస్ ఫర్హాన్ మేఘాలలో కేవలం ఆధ్యాత్మిక రూపాలనే కాకుండా, అనేక రకాల జంతువుల ఆకృతులు, మానవీయ కోణాలు, మరియు జీవశాస్త్ర సంబంధిత నమూనాలను కెమెరాలో బంధించి, మేఘాల ద్వారా పర్యావరణ పరిరక్షణ సందేశాలను సమాజానికి అందిస్తున్నారు.

ఈ సందర్భంగా, ఆకాశంలో ఆవిర్భవించిన మహా శివుడి రూపాల మేఘాల ఫోటోగ్రఫీ (శివలింగం, ఓంకారం, నంది మరియు అభిషేక దృశ్యాలు) ఫ్రేమ్‌ను డాక్టర్ రమణ చారి కి సమర్పించారు. ఫ్రేమ్‌లోని చిత్రాలను వీక్షించిన రమణ చారి ఫర్హాన్ యొక్క నిశిత పరిశీలనా ప్రతిభను, కళాత్మక దృక్పథాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కే.వి. రమణ చారి మాట్లాడుతూ "యూనుస్ ఫర్హాన్ కెమెరా దృశ్యపటలం కేవలం మేఘాలను మాత్రమే బంధించలేదు, ప్రకృతి అంతర్లీనంగా దాగి ఉన్న దివ్య శక్తిని, దైవిక రూపాలను ఆవిష్కరించింది. ఆకాశంలో ఆవిర్భవించిన శివలింగం, ఓంకారం, నంది మరియు అభిషేక దృశ్యాలను అత్యంత స్పష్టతతో, భక్తిభావం ఉట్టిపడేలా చిత్రీకరించడం శ్లాఘనీయం అని పేర్కొన్నారు.

అలాగే, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగం ద్వారా యూనుస్ ఫర్హాన్ అంతర్జాతీయ

గుర్తింపు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. "మేఘాల రూపంలో జంతువులు, జీవశాస్త్రం మరియు మానవీయ దృశ్యాలను ఆవిష్కరిస్తూ, ప్రకృతి అందించే సందేశాలను ఫోటోగ్రఫీ మాధ్యమంగా సమాజంలోకి తీసుకెళ్లడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం అభినందనీయమైన ఆలోచన. ఈ నూతన దృక్పథం మరెంతో మందికి ప్రేరణగా నిలవాలి" అని ఆకాంక్షిస్తూ, ఫర్హాన్‌కు తమ ఆశీస్సులను అందజేశారు.

# బిఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసిన రామప్రభు..

**శేరిలింగంపల్లి నీలగిరి వార్త ..**



నర్సంపేట మాజీ ఎమ్మెల్యేపెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుకు గురై చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రిలో చేరిన విషయం తెలుసుకున్న అట్టేపల్లి రామప్రభు ఆసుపత్రికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఈ క్లిష్ట సమయంలో తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి రామప్రభు తో పాటు నిమ్మగడ్డ వెంకన్న, బోయిని మహేష్ యాదవ్, ఫ్లోరెన్స్, ఎడ్ల కల్పన, అడప అజయ్, అట్టేపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల అలంకరణ తో మహంకాళి అమ్మ వారి కి ప్రత్యేక పూజలు..

**భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం..**

**శేరిలింగంపల్లి నీలగిరి వార్త**



.. మాదాపూర్ డివిజన్ గుట్టల బేగంపేట్ లోని ప్రసిద్ధ శ్రీమహంకాళి దేవాలయంలో మంగళవారం ఆషాడ మాస ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ప్రతి మంగళవారం అమ్మవారికి కూరగాయలతో ప్రత్యేక అలంకరణ చేయడం ఇక్కడి ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా టమాటా, వంకాయ, బీరకాయ, దొండకాయ, బెండకాయ తదితర వివిధ రకాల కూరగాయలతో అమ్మవారి విగ్రహాన్ని అందంగా అలంకరించారు.ఆలయ కమిటీ సభ్యులు ఎం. గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కూరగాయల అలంకరణ చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ అందజేశారు .ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆషాడ మాసంలో చేసే ఈ ప్రత్యేక పూజలతో భక్తుల కోరికలు నెరవేరుతాయని, ప్రతి ఏటా ఇదే తరహాలో పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

# హైదరనగర్ లో మైసమ్మ ఆలయంలో ఆషాఢ మాసం బోనం సమర్పణ..

**హైదర్ నగర్ నీలగిరి వార్త ..**



ఆషాడ మాసం సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ గ్రామానికి చెందిన, శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ యాదవ్ మంగళ వారం రోజు హైదర్‌నగర్‌లోని మైసమ్మ అమ్మవారి దేవాలయంలో బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, దర్శించుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, గంగల నరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్, నల్ల సంజీవరెడ్డి, ముద్దంగుల తిరుపతి, గంగల జంగయ్య యాదవ్, గంగల మల్లేష్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు గంగల రాధాకృష్ణ యాదవ్, ఉప్పల ఏకాంత్ గౌడ్, నారగోని కృష్ణ గౌడ్, నగేష్ నాయక్, టిఆర్ఎస్ నిమ్మల రామకృష్ణ గౌడ్, బిజెపి నేత బోయిని మహేష్ యాదవ్ , బి ఆర్ ఎస్ నేత సంగారెడ్డి ,కే కృష్ణ నాయక్,బ్రహ్మయాదవ్,

,కోటేష్,రజనీకాంత్ రెడ్డి,శీను నాయక్,ఎన్ లక్ష్మణ్ ముదిరాజ్,రామస్వామి యాదవ్ పాటు పలువురు సోదరులు, బంధుమిత్రులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.ఆషాడ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.



# ప్రజల్లో కామెర్లపై అవగాహన పెంపొందించాలి

**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు**

**ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి,**

జూలై 28: కామెర్ల వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంఅండ్ హెచ్ ఓ మాట్లాడుతూ హెపటైటిస్ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే వైరల్ వ్యాధి అని, హెపటైటిస్--ఎ, బి, సి, డి, రకాల వైరస్‌ల వల్ల ఈ వ్యాధి సోకుతుందని అన్నారు. ముఖ్యంగా హెపటైటిస్--బి వ్యాధిని టీకా ద్వారా పూర్తిగా నివారించే అవకాశం ఉందని, ప్రతి శిశువుకు పుట్టిన వెంటనే హెపటైటిస్--బి జనన మోతాదు టీకా, అనంతరం జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం అన్ని మోతాదులు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పరీక్షించిన సురక్షిత రక్తాన్ని మాత్రమే వినియోగించడం, ఒకసారి మాత్రమే ఉపయోగించే సూదులు, సిరంజిలను ఉపయోగించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిశుభ్రమైన ఆహారం, సురక్షిత తాగునీటిని వినియోగించడం ద్వారా హెపటైటిస్ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. హెపటైటిస్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుని, సకాలంలో చికిత్స పొందితే కాలేయం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని ప్రజలకు సూచించారు. హెపటైటిస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని, అపోహలను వీడి సరైన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రామారావు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలోని మహిళా బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల శిక్షణ(ఏ ఎన్ ఎం ట్రైనింగ్ స్కూల్) పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అలాగే కేంద్ర ఔషధ నిల్వ కేంద్రం మరియు సార్వత్రిక రోగనిరోధక టీకాల విభాగాన్ని తనిఖీ చేసి, మరమ్మతు పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర వ్యాధుల పర్యవేక్షణ కార్యక్రమ అధికారి డా. మోతియా, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్య సూపరింటెండెంట్ డా. నరేందర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. కిరణ్, నోడల్ అధికారి డా. సమతారాణి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా. నాగేంద్ర ప్రసాద్, జిల్లా వ్యాక్సిన్ మరియు లాజిస్టిక్స్ మేనేజర్ శ్రీ రమణ, జిల్లా కార్యక్రమ అధికారి శ్రీమతి దుర్గ, డా. ఎల్. రాంబాబు, నర్సింగ్ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థి సమస్యలో కోసం సెప్టెంబర్ 8న చలో హైదరాబాద్

**- ఎం ఎస్ ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ.**



**తాండూరు, జూలై 28 :**

విద్యార్థి సమస్యలో కోసం సెప్టెంబర్ 8న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని ఎం ఎస్ ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ తెలిపారు. మంగళవారం తాండూరు పట్టణంలో ఎం ఎస్ ఎఫ్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం వికారాబాద్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తాండూరు మండల కన్వీనర్ వెంకట్ మాదిగ, యాలాల్ మండల కన్వీనర్ జానీ మాదిగ, పెద్దేముల్ మండల కన్వీనర్ అరవింద్ మాదిగ, బషీరాబాద్ మండల కన్వీనర్ శ్రీరామ్ మాదిగ, జిల్లా కో కన్వీనర్ భరత్ మాదిగ,విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎం ఎస్ ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ మాట్లాడుతూ వికారాబాద్, తాండూరు ప్రాంతంలో ఉన్న అన్ని కాలేజ్ ల్లో నూతన కమిటీలు నిర్మించి ఎం ఎస్ ఎఫ్ నీ మరింత బలంగా నిర్మాణం చేసి విద్యార్థుల సమస్యలో కోసం మనం పోరాడాలని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజ్ రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు విడుదల చేయక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ తో సెప్టెంబర్ 8న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణమాదిగ నాయకత్వంలో చలో హైదరాబాద్ కార్యాచరణకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. దాంట్లో బాగంగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నూతన కమిటీలు నిర్మాణం చేస్తామని ముఖ్యంగా తాండూరులో ఎం ఎస్ ఎఫ్ నీ బలోపితం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎఫ్ నాయకులు మహేష్ మాదిగ, రమేష్ మాదిగ, లాజర్ మాదిగ, నరేష్ మాదిగ, ప్రకాష్ మాదిగ, సాయి మాదిగ,తదితరులు పాల్గొన్నారు.

# గోకుల్ ప్లాట్స్ లో ఉచిత వైద్య శిభిరం ముఖ్యఅతిథిగా హాజరైన పీ ఎ సి చైర్మన్ అరికెపూడి గాంధీ..



**శేరిలింగంపల్లి నీలగిరి వార్త ..**

గోకుల్ ప్లాట్స్ వెంకటరమణ కాలనీలో మంగళవారం రోజు బేరాక చర్చి పాస్టర్ ఏసు పాదం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ను నిర్వహించారు.ఈ కార్యక్రమా నికి శేర్లింగంపల్లి నియోజకవర్గం స్థానిక శాసనస భ్యులు పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాని ప్రారంభించారు. అనంతరం వారు అక్క డ వచ్చిన వివిధ రకాల ఆస్పత్రిల నైపుణ్యం కలిగిన డాక్టర్ల బృందం నర్సులు వారికి బీపీ టెస్ట్ చేసారు తన ఆరోగ్యం ఎలా ఉందని తెలియజే యమని కూర్చోవడం జరిగింది. వారు చక్కగా బిపిని చెక్ చేసి మీ ఆరోగ్యం బాగానే ఉందని ఇదే రకంగా మీరు ఏమైతే తీసుకుంటున్నారో దాన్ని కొనసాగించాలని తెలిపారు. ఉచిత మెడికల్ క్యాంపు కార్యక్రమంలో స్థానిక యువ నాయకులు వార్డ్ మెంబర్లు, చర్చి సంబంధించినటువంటి సోద ర సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ఫేస్‌ప్యాక్ వేసుకునేప్పుడు.. ఈ తప్పులు చేయకూడదు..!





అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలని.. ప్రతి ఒక్క అమ్మాయి, మహిళ కోరుకుంటుంది. వారి సౌందర్యాన్ని రెట్టింపు చేసుకోవడానికి, వారి అందాన్ని కాపాడుకోవడానికి ఏవేవో స్కిన్‌కేర్ రొటీన్స్ ఫాలో అవుతుంటారు. ఎక్కువమంది ఫాలో అయ్యే.. బ్యూటీకేర్ రొటీన్ ఫేస్ మాస్క్‌లు. వారి అందానికి మెరుగులు పెట్టడానికి.. ఇంట్లో దొరికే సహజమైన వస్తువులతోనే.. ఫేస్‌మాస్క్‌లు వేసేస్తూ ఉంటారు. అయితే, ఫేస్‌మాస్క్ అప్లై చేసేప్పుడు చేసే కొన్ని పొరపాట్ల కారణంగా దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఫేస్‌మాస్క్ అప్లై చేసేప్పుడు చేయకూడని 5 పొరపాట్లు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

ప్యాచ్ టెస్ట్ చేయట్లేదా.. కొత్తరకం ఫేస్‌మాస్క్ అప్లై చేసేముందు.. ప్యాచ్ టెస్ట్ కచ్చితంగా చేసుకోవాలని నిపుణులు అంటున్నారు. ఒకరికి బాగా పనిచేసే.. ఫేస్ ప్యాక్ మరొకరికి పడకపోవచ్చు. దానిలో పదార్థాలు అలెర్జీ, చికాకు కలిగించవచ్చు. మీరు ఫేస్‌ప్యాక్ అప్లై చేసేముందు.. ఏదైనా చిన్న ప్రాంతంలో ప్యాచ్ టెస్ట్ చేయడం మర్చిపోకండి. రాగులతో ఇలా మాస్క్ వేసుకుంటే.. మొటిమలు మాయం అవుతాయ్, పిగ్మెంటేషన్ కూడా దూరం అవుతుంది..!




తరచూ ఫేస్ ప్యాక్ వేస్తున్నారా.. కొంతమంది అందంగా కనిపించాలని తరచూ ఫేస్ ప్యాక్స్ వేస్తుంటారు. అయితే వీటిని తరచుగా అప్లై చేస్తే.. ఓవర్ ఎక్స్‌ఫోలియేషన్ అవుతుంది. దీనికారణంగా చర్మం పొడిబారుతుంది, కొన్నిసార్లు చికాకు కూడా కలిగిస్తుంది. . ఓవర్-ఎక్స్‌ఫోలియేషన్ చర్మాన్ని సున్నితంగా మారుస్తుంది. అతి ఏదైనా హాని చేస్తుందని గుర్తుంచుకోండి.

ముఖాన్ని శుభ్రం చేసుకోవట్లేదా.. ముఖాన్ని శుభ్రం చేసుకోవట్లేదా.. కొంతమంది ముఖం శుభ్రం చేసుకోకముందే.. ఫేస్‌ప్యాక్ అప్లై చేస్తుంటారు. మీ ముఖాన్ని సరిగ్గా శుభ్రం చేసుకోకుండా.. ప్యాక్ అప్లై చేస్తే.. ఉత్పత్తి సమర్థవంతంగా చర్మంలోని వెళ్లదు. దీనివల్ల ప్యాక్ ఎఫెక్టివ్‌గా పనిచేయదు. ఏదైనా ఫేస్ ప్యాక్ వేసుకునే ముందు మీ ముఖాన్ని శుభ్రం చేసుకోవడం మర్చిపోవద్దు. ప్యాక్‌వేసి ఎక్కువసేపు ఉంచుకోవద్దు.. కొందరు ఫేస్‌ప్యాక్ అప్లై చేసి.. ఎక్కువసేపు ఆరనిస్తారు. ఇలా చేస్తే.. చర్మానికి చికాకు కలిగిస్తుంది. అంతేకాదు, చర్మంలోని సహజ నూనెలు కోల్పోతాయి. మీరు ప్యాక్ ఆరిన వెంటనే శుభ్రం చేయడం చాలా ముఖ్యం.

# ఈ ఆసనాలు చేస్తే సైనస్ తగ్గుతుందట..







సైనస్ ఉంటే ముక్కు మూసుకుపోయి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉంటుంది. ఇది చలికాలంలో మరింత ఎక్కువ అవుతుంది. అలాంటి సమస్యకి చెక్ పెట్టాలంటే ఈ ఆసనాలు హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి. మన శ్వాసకోశ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటేనే మనం హెల్దీగా ఉండగలం. కానీ, కొన్ని సమస్యల కారణంగా శ్వాస సమస్యలు వస్తాయి. అందులో సైనస్ కూడా ఒకటి. దీని వల్ల ముక్కు రంధ్రాలు మూసుకుపోతాయి. దీనిని అస్సలు తేలిగ్గా తీసుకోలేం. కానీ కొన్ని యోగాసనాలతో సైనస్ సమస్యని పరిష్కరించుకోవచ్చు. సేతు బంధాసనం.. ఇది బ్రిడ్జ్ పోజ్ అని చెప్పొచ్చు. దీనిని చేయడం వల్ల బ్యాక్, కాళ్ళను బలంగా చేస్తుంది. మీ గొంతు, ఛాతీని క్లియర్ చేస్తుంది. మూసుకుపోయిన ముక్కు నుండి ఉపశమనం పొందేలా చేస్తుంది. ప్రాణాయామం.. ఇందులో ముఖ్యంగా అనులోమ, విలోమ, కపాలభాతి వంటి ప్రాణాయామ పద్ధతులు నాసికా రంధ్రాలను క్లియర్ చేస్తాయి. వీటిని చేయడం వల్ల శ్వాస ప్రక్రియలు నియంత్రిస్తాయి. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుంది. దీంతో ఆక్సిజన్ సరఫరా పెరిగి సమస్యకి పరిష్కారం లభిస్తుంది. భుజంగాసన.. ఇది మీ ఛాతీని ఎక్స్‌పాండ్ చేసి సైనస్ సమస్యల నుండి రిలాక్స్ చేసే నాగు పాము భంగిమ. దీనిని చేయడం వల్ల ఛాతీ ఎక్స్‌పాండ్ అయి వెన్నెముకని బలంగా చేసి వెన్నునొప్పిని కూడా తగ్గిస్తుంది. ఛాతీలో ఇబ్బంది తగ్గడంతో సైనస్ కూడాతగ్గుతుంది. పర్వతాసన.. ముక్కు రంధ్రాలను క్లియర్ చేసి మంట నుండి రిలాక్స్ చేసేలా చేస్తుంది. దీనిని చేయడం వల్ల భుజాలు, చేతులని చాచి చేయొచ్చు. దీని వల్ల సైనస్ వంటి సమస్యలు దూరమవుతాయి.

# తిన్న తర్వాత సోడా కూల్‌డ్రింక్స్ తాగుతున్నారా..





చాలా మందికి బిర్యానీ తింటూ కూల్ డ్రింక్స్ తాగడం అలవాటు. దీని వల్ల కడుపులో హాయిగా ఉందనుకుంటారు. కానీ, కొన్ని సమస్యలున్నాయి. అవేంటో తెలుసుకోండి. తిన్న తర్వాత సోడా, కూల్‌డ్రింక్స్ తాగుతున్నారా.. జాగ్రత్త.. ఏదైనా హెవీగా భోజనం చేసినప్పుడు చాలా మంది సోడా, కూల్ డ్రింక్స్ తాగడం చేస్తుంటారు. లేదా నిమ్మకాయ సోడాలో ఉప్పు కలిపి తాగుతారు. దీని వల్ల కడుపులో కాస్తా రిలాక్స్‌గా ఉన్నట్లుగా త్రేన్పులు వస్తాయి. అప్పటికప్పుడు రిలాక్స్‌గా ఫీల్ అవుతారు. కానీ, తర్వాత కొన్ని సమస్యలొస్తాయని చెబుతున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకోండి.




సోడా తాగితే.. భోజనం చేశాక సోడా తాగితే ఎక్కువగా తినాలనే కోరికలు తగ్గుతాయి. వెంటనే కడుపులో పేరుకుపోయిన గ్యాస్ పోయినట్టుగా అనిపిస్తుంది. కానీ, ఇది తాత్కాలికంగా మాత్రమే. తిన్నాక సోడా తాగితే గ్యాస్ పెరుగుతుంది. దీంతో పాటు చాలా సమస్యలొస్తాయి.

గ్యాస్ పెరిగితే.. కడుపులో గ్యాస్ పెరిగితే పొట్ట నొప్పి వస్తుంది. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా అనిపిస్తుంది. దీంతో కూర్చోలేరు, నించోలేరు ఇబ్బందిగా ఉంటుంది. అదే విధంగా కొంతమందికి గుండెల్లో మంట, మలబద్ధకం, త్రేన్పులు, వెన్నునొప్పి వీటితో పాటు ఛాతీ నొప్పి కూడా వచ్చే అవకాశం ఉంది.

జ్యూసెస్.. ఇక కొంతమంది, అదే విధంగా తిన్న తర్వాత జ్యూస్ కూడా తాగుతారు. ఇలా తాగడం కూడా అస్సలు మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. దీంతో బరువు కూడా పెరుగుతారు. అందుకే, వీటిని తాగకపోవడమే మంచిది. ఏం తాగాలి.. తిన్న తర్వాత వేడినీరు తాగడం మంచిది. భోజనం మధ్యలో నీరు తాగొద్దు. తిన్న తర్వాత కాసేపటికి గోరువెచ్చని నీరు, జీలకర్ర నీరు తాగడం మంచిది. మీకు ఏం తాగడం ఇష్టం లేకపోతే కాసేపటి తర్వాత గోరువెచ్చని నీరు తాగండి. దీంతో తిన్న ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. వీలైతే హెర్బల్ టీలు కూడా తాగొచ్చు.

# గుండెకు చాలా మంచిది



ఫైబర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బరువును కంట్రోల్‌లో ఉంచడంలో, జీర్ణక్రియ సక్రమంగా పనిచేయడానికి ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుంది. రోజువారీ ప్రతిపాదించిన ఫైబర్ తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది, ఫైబర్స్ గట్ మైక్రోబయోటాను మీడియేట్ చేస్తుంది, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో రకరకాలు ఉండొచ్చు గానీ ప్రధానమైనవి నీటిలో కరిగేది, నీటిలో కరగనిది. నీటిలో కరిగే పీచు మృదువుగా ఉంటుంది. నీటిని పీల్చుకోవటం ద్వారా ఇది మల పదార్థం ఏర్పడేలా, విసర్జన సాఫీగా సాగేలా చేస్తుంది. ఇది కూరగాయలు, విత్తనాలు, దంపుడు బియ్యం, బార్లీ, ఓట్స్ వంటి వాటితో లభిస్తుంది. నీటిలో కరగని ఫైబర్ కాస్త గట్టిగా ఉంటుంది. లివర్ నుంచి పేగుల్లోకి వచ్చే కొలెస్ట్రాల్‌ను ఇది పట్టేసుకుంటుంది. ఇది విత్తనాలు, పండ్లు, పప్పుధాన్యాలతో లభిస్తుంది. ఫైబర్ రిచ్ ఫుడ్స్ మన డైట్‌లో తీసుకుంటే.. ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చో నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గుతారు.. ఫైబర్స్ మన శరీరంలోని గట్ బాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. ఫైబర్ రిచ్ డైట్ మన కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. త్వరగా ఆకలి వేయకుండా నియంత్రిస్తుంది.. తద్వారా అతిగా తినకుండా కంట్రోల్‌లో ఉంటాం. ఫైబర్ శరీరంలోని కొవ్వు త్వరగా కరగడానికి సహాయపడు తుంది, బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంచుతుంది.. ఫైబర్ రిచ్ డైట్ బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది, ఎందుకంటే మానవ శరీరం ఫైబర్‌ను గ్రహించుకోలేదు, విచ్ఛిన్న చేయలేదు. ఇది కార్బోహైడ్రేట్ల కారణంగా.. రక్తంలో పెరిగే చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో






ఉంచుతుంది. ఆహారం త్వరగా జీర్ణం కాకుండా చూస్తూ రక్తంలోకి గ్లూకోజు నెమ్మదిగా వెళ్లేలా చేస్తుంది. వైద్యులు సాధారణంగా 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు ప్రతిరోజూ 22-35 గ్రాముల ఫైబర్ తీసుకోవాలని సిఫార్సు చేస్తారు.

గుండెకు మంచిది..

ఫైబర్ రిచ్ డైట్ గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. నీటిలో కరగని ఫైబర్ . లివర్ నుంచి పేగుల్లోకి వచ్చే కొలెస్ట్రాల్‌ను ఇది పట్టేసుకుంటుంది. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. కరగని ఫైబర్ ఎక్కువగా.. విత్తనాలు, పండ్లు, పప్పుధాన్యాలతో లభిస్తుంది. ఫైబర్ రిచ్ ఫుడ్స్ హైపర్‌టెన్షన్‌ను, శరీరంలోని ఇన్ఫ్లమేషన్‌ను కూడా కంట్రోల్‌లో ఉంచుతుంది.

క్యాన్సర్ రిస్క్ తగ్గిస్తుంది.. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్లలో లభించే ఫైబర్ కొన్ని రకాల క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. నీటిలో కరిగే పీచు మృదువుగా ఉంటుంది. నీటిని పీల్చుకోవటం ద్వారా ఇది మల పదార్థం ఏర్పడేలా, విసర్జన సాఫీగా సాగేలా చేస్తుంది. రెగ్యులర్ ప్రేగు కదలికలు సంభావ్య హానికరమైన పదార్థాలు పెద్దప్రేగు లైనింగ్‌తో సంబంధంలో ఉండే సమయాన్ని తగ్గిస్తాయి, ఇది కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎంత తీసుకోవాలి.. ఫైబర్ అవసరం జీర్ణ వ్యవస్థ పరిమాణాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. పెద్దగా ఉంటే ఎక్కువ ఫైబర్ కావాలి. ఉదాహరణకు- 50 కిలోల బరువు ఉన్నవారికి రోజుకు 20-25 గ్రాములు అవసరం. అదే 75 కిలోల బరువుంటే సుమారు 30-35 గ్రాములు కావాలి.

# వదులైన బట్టలు వేసుకుంటే..




ఒకప్పుడు బట్టలు టైట్‌గా ఉంటే ఫ్యాషన్. కానీ, ఎప్పటికప్పుడు ట్రెండ్స్ మారుతుంటాయి. కాబట్టి, ప్రజెంట్ కాస్తా లూజ్‌గా ఉండే డ్రెస్సెస్‌ని కూడా ట్రై చేస్తున్నారు. వదులైన బట్టలు వేసుకుంటే స్టైల్‌తో పాటు ఈ లాభాలు కూడా.. నిజానికి లూజ్‌గా ఉండే బట్టలు అంటే అంతగా ఇష్టపడరు. దీని వల్ల తమ లుక్స్ అతగా బాగోవని అనుకునేవారు. కానీ, ఇప్పుడు చాలా మంది కంఫర్ట్‌నెస్‌ని కోరుకుంటారు. సెలబ్రిటీలు సైతం వదులుగా ఉండే బట్టల్ని స్టైల్ చేసి పోజులివ్వడంతో చాలా మంది లూజ్‌గా ఉండే బట్టల్ని వేసుకుంటున్నారు. మీరు ఇందుకోసం మళ్ళీ షాపింగ్ చేయాల్సిన అవసరం లేదు. మీ ఇంట్లో వారి బట్టల్ని స్టైల్ చేయొచ్చు. అందుకోసం ఏ టిప్స్ పాటించాలో చూద్దాం. లూజ్ ప్యాంట్స్.. లూజ్ ప్యాట్స్‌ని కాస్తా టైట్‌గా ఉండే టాప్స్, ఫన్నీ షర్ట్స్, క్రాప్ టాప్‌తో మ్యాచ్ చెయొచ్చు. అదే విధంగా.. లూజ్‌గా ఉన్న ప్యాట్స్ వేసుకున్నప్పుడు వాటిపైకి షూస్ వేసుకుంటే మంచి లుక్ వస్తుంది.



కుర్తీ.. మీరు లూజ్‌గా ఉండే కుర్తీలు కూడా వేసుకోవచ్చు. ఈ కుర్తీని స్టైల్ చేసే ముందు మీకు సెట్ అవుతుందో లేదో తెలుసుకోండి. అదే విధంగా, కొన్ని మెటీరియల్స్ కుర్తీలు, కాటన్ కుర్తీలు అందరికీ సెట్ కాకపోవచ్చు. కాబట్టి, కుర్తీని సెలక్ట్ చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు.

బీచ్ లుక్.. లూజ్‌గా ఉన్న డ్రెస్సెస్ మంచి బీచ్ లుక్‌ని కూడా ఇస్తాయి. ఇందుకోసం లూజ్ మ్యాక్సీ డ్రెస్ వేసుకోవచ్చు. పార్టీ లుక్ ఇవ్వడానికి బెల్ట్, బూట్స్‌తో దీనిని పేర్ అప్ చేయొచ్చు. అదే విధంగా, షార్ట్ ప్యాంట్, లూజ్ టీ షర్ట్స్, మినీ టిప్స్, షర్ట్స్ స్టైల్ చేయొచ్చు.




లూజ్ టీ షర్ట్.. లూజ్ టీ షర్ట్ ఎంత కంఫర్ట్‌గా ఉంటుందో అంతే ఫ్యాషన్‌గా కూడా కనిపిస్తుంది. వదులుగా ఉండే టీ షర్ట్స్ క్యాజువల్ లుక్‌ని ఇస్తుంది. వీటికి మ్యాచింగ్‌గా మీరు చక్కని షార్ట్స్ వేసుకోవచ్చు. బ్యాగీ ప్యాంట్స్‌కి కూడా బానే ఉంటాయి. కార్గో ప్యాంట్స్ కూడా చక్కని ఎలివేషన్‌ని ఇస్తాయి.

లూజ్ షర్ట్.. మీరు లూజ్‌గా ఉండే బట్టలు వేసుకోవాలంటే ముందుగా మీకు లూజ్ షర్ట్ ఉండాలి. అయితే, వాటిని మీరు వేసుకునేందుకు లోపలై సరైన ఇన్నర్స్ వేసుకోవాలి. అది మీ బాడీని మొత్తం కవర్ చేయాలి. తర్వాత ఈ షర్ట్‌ని స్కిన్నీ ఫిట్ జీన్స్, స్కర్ట్స్, ప్యాంట్స్‌తో పేర్ అప్ చేయొచ్చు. వీటిని ఎలివేట్ చేయాలంటే మంచి బెల్ట్, బూట్స్ వేసుకోండి. మీరు లూజ్‌గా ఉండే బట్టలు వేసుకున్నప్పుడు కొన్ని విషయాలను గుర్తుపెట్టుకోవాలి. మంచి కలర్ కాంబినేషన్స్ ఫాలో అవ్వాలి. ఎంచుకున్న డ్రెస్సెస్‌కి సరిపోయే షూ, యాక్సెసరీస్ తీసుకోవాలి. మేకప్ కూడా డీసెంట్‌గా ఉండాలి.

లూజ్ బట్టలతో లాభాలు.. టైట్‌గా ఉండే డ్రెస్సెస్ కంటే లూజ్‌గా ఉండే బట్టలు వేస్తే చర్మ సమస్యలు రావు. చర్మానికి వెంటిలేషన్ అందుతుంది. చెమట ఎక్కువగా రాదు. దీంతో చెమట వాసన రాదు. ఇబ్బంది కూడా ఉండదు.

# పెళ్ళికి ముందు ఈ పనులు చేయాల్సిందే..








పెళ్ళి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా ముఖ్యం. ఈ ఘట్టం ముందు కొన్ని పనులు చేయడం చాలా ముఖ్యం. అవేంటో తెలుసుకోండి. ప్రతి జీవితంలోనూ ఒకరు తోడుగా ఉండడం చాలా ముఖ్యం. అప్పుడే జీవితం ఆనందమయమవుతుంది. అందుకే ఓ వయసు వచ్చాక తల్లీదండ్రులు పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేస్తారు. అయితే, పెళ్ళి చేసే ముందు కొన్ని పనులు తప్పకుండా చేయడం మంచిది. అలాంటి పనులతో జీవితాన్ని హ్యాపీగా ఆస్వాదించొచ్చు. అవేంటో తెలుసుకోండి.

సెల్ఫ్ లవ్.. మిమ్మల్ని మీరు ఎంత లవ్ చేసుకుంటారో మీ చుట్టూ ఉన్నవారు కూడా మిమ్మల్ని అంత లవ్ చేస్తారు. కాబట్టి, ఎక్కువగా మిమ్మల్ని మీరు ప్రేమించుకునేలా చూడండి. అడ్వెంచర్స్.. లైఫ్‌లో ప్రతి ఒక్క విషయాన్ని ఆస్వాదించాలి. అందుకోసం మీరు మీ కంఫర్ట్ జోన్‌లోనే వీలైనన్నీ అడ్వెంచర్స్ చేయడం చాలా ముఖ్యం. అందుకే అడ్వెంచర్స్ చేసేయండి. డబ్బు.. అదే విధంగా మ్యారేజ్‌కి ముందు మీకంటూ కొద్దిగా మనీ సేవ్ చేసుకోవడం చాలా ముఖ్యం. సెల్ఫ్ ఇండిపెండెంట్‌గా ఉండేందుకు జాబ్, బిజినెస్ చేయడం చాలా ముఖ్యం. దీని వల్ల మీకంటూ కాస్తా డబ్బు ఉంటుంది.

సామాజిక సేవ.. వీలైనంత వరకూ కొద్దిగానైనా సాజిక సేవకి టైమ్ కేటాయించండి. దీని కోసం మీరు వాలంటీర్‌గా కూడా పనిచేయొచ్చు. అది ఏ రూపంగా అయినా సరే సామాజిక సేవ చేయడం ముఖ్యమని గుర్తుపెట్టుకోండి. టైమ్ స్పెండ్.. అదే విధంగా, స్నేహితులు, బంధువులతో వీలైనంతత వరకూ ఎక్కువ సమయాన్ని గడపండి. వీలైతే మ్యారేజ్ అయ్యాక కూడా ఈ రిలేషన్‌ని కంటిన్యూ చేయండి. దీని వల్ల మీ రిలేషన్ గ్యాప్ రాకుండా ఉంటుంది. ఇష్టపడే పనులు.. అదే విధంగా, మీకు ఇష్టమైన పనులు చేయండి. దీని వల్ల ప్రతి దాన్ని ఆస్వాదించిన వారవుతారు. అదే విధంగా ఏదైనా నేర్చుకోవడానికి ట్రై చేయండి. చాలా కళలు ఉన్నాయి. కొత్త విషయాలు నేర్చుకోండి. ఇవి జీవితంలో ఏదైనా టైమ్‌లో హెల్ప్ అవుతాయి. హెల్త్.. ఈ టైమ్‌లో మీ హెల్త్‌పై కూడా కేర్ తీసుకోండి. మానసిక, శారీరకంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోండి. మంచి హెల్దీ ఫుడ్ తీసుకోండి. రెగ్యులర్‌గా వర్కౌట్ చేయండి. హ్యాపీగా నిద్రపోండి. సింగిల్ జర్నీ.. జీవితంలో ఒంటరిగా ప్రయాణించడం అనేది ప్రతి ఒక్కరూ కూడా ఎక్స్‌పీరియెన్స్ చేయాలి. దీని వల్ల ఎలాంటి పరిస్థితినైనా ఒంటరిగా ఎదుర్కొనే శక్తి మీకు అందిస్తాయి. అందుకే కచ్చితంగా ఒంటరిగా ప్రయాణాలు చేసి చూడండి. అదే చాలా వరకూ హ్యాపీనెస్ ఇస్తుంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, జూలై 28 :** అంతర్జాతీయ, భౌగోళిక, రాజకీ య కారణాల నేపథ్యంలో బంగారం ధరలు తగ్గు ముఖం పట్టాయి. మంగళవారం పసిడి ధరలు భారీ తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,170 గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1690 మేర తగ్గింది.. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,150గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1550 మేర తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు ఐదు వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,35,000గా ఉంది.






# ఈ 5 సెట్టింగ్స్ మార్చుకుంటే.. మీ వాట్సప్ సేఫ్

ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫాం వాట్సప్ మన నిత్యజీవితంలో భాగమైపోయింది. ఏదైనా అవసరం ఉంటే వాట్సప్‌లో మెసేజ్ చెయ్యి, వాట్సప్‌లో వీడియో కాల్ చెయ్యి అని చెప్పేంతలా మారిపోయింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. స్నేహితులతో మాట్లాడటం నుంచి వ్యాపార కార్యకలాపాల వరకు.. ఫొటోల నుంచి సున్నితమైన డాక్యుమెంట్ల వరకు వాట్సప్‌లోనే పంపిస్తుంటాం. కాబట్టి వాట్సప్‌లోని మన సమాచార భద్రత, వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. అందుకోసం ఓ ఐదు ముఖ్యమైన సెట్టింగ్స్ మార్చుకుంటే మంచిది. అవేంటో చూద్దాం..

**టు-స్టెప్ వెరిఫికేషన్:** ఇతర డివైజ్‌ల్లో మీ అనుమతి లేకుండా మీ నంబరుపై వాట్సప్‌ను క్రియేట్ చేయకుండా ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇందుకోసం Settings > Account > Two-step verification > Turn on చేసుకోని 6 అంకెల పిన్‌ను సెట్ చేసుకోవాలి. మీ ఖాతా దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఇది అదనపు భద్రతనిస్తుంది. ఒకవేళ పిన్ మరిచిపోతే ఇ-మెయిల్ ద్వారా రీసెట్ చేసుకోవచ్చు.

**కాంటాక్టులకు మాత్రమే:** వాట్సప్ ప్రొఫైల్ పిక్చర్, స్టేటస్, ఆన్‌లైన్ యాక్టివిటీ వంటి వ్యక్తిగత సమాచారం కావాల్సిన వారికే తెలిసేలా ఇది ఉపయోగపడుతుంది. ఇందుకోసం Settings > Privacy లోకి వెళ్లాలి. అక్కడ మై కాంటాక్ట్స్, మై కాంటాక్ట్స్ ఎక్సెప్ట్ వంటి ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలి.

ఆగంతుకుల కాల్స్...ష్!: తెలియని నంబర్లు లేదా స్పామ్ నంబర్ల కాల్స్ రింగ్ కాకుండా 'సైలెన్స్ అన్‌నోన్ కాలర్స్' ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇందుకోసం Settings > Privacy > Calls లోకి వెళ్లి 'Silence Unknown Callers' ఎనేబుల్ చేసుకోవాలి. కాల్స్ ట్యాబ్‌లో అలా వచ్చిన నంబర్ కాల్స్‌ను చూపిస్తుంది.

**చాట్/ యాప్ లాక్:** ఫోన్ వేరే వాళ్ల చేతుల్లోకి వెళ్లిన సమయంలో వాట్సప్‌లోని చాటింగ్‌లు, వ్యక్తిగత విషయాలు ఇతరులు చూడకుండా ఈ సదుపాయం ఉపయోగపడుతుంది. కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన సంభాషణలు మాత్రమే చూడకుండా చేయాలంటే చాట్ లాక్ వినియోగించొచ్చు. మీ వాట్సప్‌నే ఎవరూ యాక్సెస్ చేయకూడదూ అంటే యాప్ లాక్ చేసుకోవడం ఉత్తమం.

**ఐపీ అడ్రస్ ప్రొటెక్షన్:** వాట్సప్ కాల్స్ మాట్లాడే సమయంలో మీరున్న ప్రాంతాన్ని లేదంటే ఐపీ అడ్రస్ కనుగొనకుండా చేయొచ్చు. ఇందుకు Settings > Privacy > Advancedలోకి వెళ్లి ప్రొటెక్ట్ ఐపీ అడ్రస్ ఇన్ కాల్స్ ఆప్షన్‌ను ఎనేబుల్ చేసుకోవాలి. అప్పుడు వాట్సప్ తన సర్వర్ల ద్వారా కాల్స్‌ను రూట్ చేస్తుంది. కాల్ క్వాలిటీలో చిన్నపాటి తేడా రావొచ్చు.



# శ్రీలంకతో టెస్టు సిరీస్..

## భారత జట్టు ప్రకటన

శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 15 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ మొదలుకానుంది. ఈ సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ జట్టును ప్రకటించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన 33 ఏళ్ల ఆఫ్‌స్పిన్నర్ సరాంశ్ జైన్ తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్‌లకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తే.. మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారు. తొడ కండరాల గాయం నుంచి కోలుకుంటున్న ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ రెండో టెస్టుకు మాత్రమే అందుబాటులో ఉంటాడు. గాయాల కారణంగా నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణాలను సెలక్టర్లు పక్కనపెట్టారు. ఆగస్టు 15న గాలెలో తొలి టెస్టు, 23న కొలంబోలో రెండో టెస్టు ప్రారంభంకానుంది.

**భారత జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), సాయి సుదర్శన్‌లి, ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్‌ప్రీత్ బుమ్రాలి, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాంశ్ జైన్.



# విండీస్ బౌలర్ ప్రపంచ రికార్డు

## వరుసగా ఐదు ఓవర్లు మెయిడిన్లు.. ఐదు వికెట్లు..

ట్రినిడాడ్‌లో పాకిస్థాన్‌తో జరుగుతోన్న తొలి టెస్టు మ్యాచ్‌లో వెస్టిండీస్ ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో తన తొలి ఐదు ఓవర్లలో గ్రీవ్స్ 27 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు. తన సెకండ్ స్పెల్‌లో మాత్రం ఈ పేస్ ఆల్‌రౌండర్ ఒక్క పరుగూ ఇవ్వకుండా.. వరసగా ఐదు ఓవర్లలో ఒక్కో వికెట్ చొప్పున మొత్తం ఐదు వికెట్లు పడగొట్టాడు. దీంతో టెస్టు క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. టెస్టుల్లో గ్రీవ్స్‌కు ఇది తొలి ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం. 2016 జనవరిలో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై ఇంగ్లాండ్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ వరసగా నాలుగు వికెట్ మెయిడిన్ల రికార్డును జస్టిన్ గ్రీవ్స్ తాజాగా బ్రేక్ చేశాడు. విండీస్, పాక్ తొలి టెస్టు విషయానికొస్తే.. ఈ మ్యాచ్‌లో మూడో రోజు పాకిస్థాన్ 244/4 స్కోరుతో ఉండగా తన రెండో స్పెల్ మొదలుపెట్టిన జస్టిన్ గ్రీవ్.. పాక్ బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. వరస ఓవర్లలో షాన్ మసూద్ (109), ఆమీర్ జమాల్ (3), అలీ ఉస్మాన్ (0), మహ్మద్ రిజ్వాన్ (12), మహ్మద్ అబ్బాస్ (0)లను పెవిలియన్‌కు పంపాడు. భారీ స్కోరు చేసేలా కనిపించిన పాక్.. గ్రీవ్స్ దెబ్బకు 282 పరుగులకు ఆలౌటైంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సెకండ్ ఇన్నింగ్స్‌లో విండీస్ 126/7తో నిలిచి 155 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## మనోళ్లు దొరికిపోతున్నారు..

# బౌండరీలు వెనక్కి జరపండి

### సునీల్ గవాస్కర్



స్వదేశంలో అదరగొట్టే భారత బ్యాటర్లు పెద్ద మైదానాలు ఉండే దేశాల్లో తడబడుతున్నారు. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఇది స్పష్టంగా కనిపించింది. చిన్న బౌండరీలకు అలవాటు పడిన మన బ్యాటర్లు.. పెద్ద బౌండరీలు ఉన్న గ్రౌండ్లలో భారీ షాట్లు ఆడి బౌండరీ లైన్ వద్ద ఫీల్డర్లకు చిక్కి పెవిలియన్ చేరుతున్నారు. ఈ నేపథ్యంలో సునీల్ గవాస్కర్ బీసీసీఐకి కీలక సూచన చేశారు. కొత్త సీజన్‌లో మన మైదానాల్లో బౌండరీ లైన్లను వెనక్కి జరపాలన్నారు. "ఐపీఎల్‌లో ఫ్లాట్ పిచ్‌లు, చిన్న బౌండరీలపై అదరగొట్టిన భారత బ్యాటర్లు ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో అలవాటు లేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడ్డారు. భారత్‌లో ఫ్లాట్ పిచ్‌లు ఉన్న మాట నిజమే. చాలా చిన్నగా ఉండే బౌండరీలే బ్యాటర్లకు అనుకూలిస్తాయి. దాంతో వారు సరిగ్గా షాట్ కొట్టని బంతులు కూడా బౌండరీ దాటుతున్నాయి. అదే పెద్ద, పొడవైన బౌండరీలు ఉన్న దేశాల్లో అవే షాట్లు ఆడి బౌండరీ లైన్ లోపలే ఫీల్డర్లకు చిక్కుతున్నారు. వచ్చే ఏడాది జరగబోయే ప్రపంచ కప్‌నకు ముందు మన బ్యాటర్లు అలవాటు పడేందుకు కొత్త సీజన్ ప్రారంభమయ్యే సమయానికి బౌండరీల దూరం పెంచడం అత్యంత ఆవశ్యకం. దాదాపు ప్రతి మైదానంలోనూ ఎల్‌ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల వెనుక ప్రజలు నడవడానికి తగినంత ఖాళీ స్థలం ఉంటుంది. ఆ స్థలాన్ని వినియోగించుకుని బౌండరీల పరిమాణం పెంచాలి" అని గవాస్కర్ సూచించారు.

# భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన

## భారత్‌కు దక్కిన తొలి స్వర్ణ పతకం

## ఒకే రోజు ఆరు పతకాలు కైవశం



గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో పతకాల వేట కొనసాగిస్తున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్ విభాగాల్లో భారత క్రీడాకారులు సత్తా చాటుతూ దేశానికి వరుస విజయాలు అందిస్తున్నారు. పారా అథ్లెటిక్స్‌లో షర్మిలా ధన్‌ఖఢ్ చారిత్రక స్వర్ణ పతకం సాధించగా, హైజంప్‌లో సర్వేష్ కుషారే రజతంతో చరిత్ర సృష్టించాడు. వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అజయ్ బాబు ఒక్క కిలో తేడాతో స్వర్ణం చేజార్చుకుని రజతంతో సరిపెట్టుకున్నాడు. పారా అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఎఫ్-57 విభాగంలో 40 ఏళ్ల షర్మిలా ధన్‌ఖఢ్ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. ఆమె 9.81 మీటర్ల దూరం షాట్‌పుట్ విసిరి ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. దీంతో కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించిన అథ్లెట్‌గా నిలిచింది. షర్మిల విజయం భారత బృందంలో ఆనందాన్ని నింపింది. అదే విభాగంలో పోటీ పడిన మరో భారత అథ్లెట్ శిల్పా శైలకు నాటకీయ పరిణామాల మధ్య కాంస్య పతకం దక్కింది. శిల్పా 7.26 మీటర్ల దూరం విసిరి తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసినప్పటికీ తొలుత నాలుగో స్థానంలో నిలిచింది. అయితే మూడో స్థానంలో నిలిచిన నైజీరియా అథ్లెట్ యుచారియా ఇయాజీ త్రోపై భారత బృందం అభ్యంతరం వ్యక్తం చేసింది. అధికారులు వీడియో పరిశీలించిన తర్వాత ఆ త్రోను ఫౌల్‌గా ప్రకటించారు. దీంతో నాలుగో స్థానంలో ఉన్న శిల్పాకు కాంస్య పతకం వరించింది. పురుషుల హైజంప్‌లో భారత అథ్లెట్ సర్వేష్ కుషారే మరో అరుదైన ఘనత సాధించాడు. 2.25 మీటర్ల ఎత్తు దూకి రజత పతకం గెలుచుకున్న సర్వేష్, కామన్వెల్త్ క్రీడల్లో హైజంప్ విభాగంలో రజతం సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. జమైకాకు చెందిన రొమైన్ బెక్‌ఫోర్డ్ కూడా 2.25 మీటర్లు దూకినా, కౌంట్‌బ్యాక్ నిబంధన ప్రకారం స్వర్ణ పతకం అతడిని వరించింది. అయినప్పటికీ సర్వేశ్? ప్రదర్శన భారత అథ్లెటిక్స్‌కు మరో గర్వకారణంగా నిలిచింది. వెయిట్‌లిఫ్టింగ్‌లో తెలుగు కుర్రాడు వల్లూరి అజయ్ బాబు అద్భుత పోరాటంతో రజత పతకం గెలుచుకున్నాడు. పురుషుల 79 కిలోల విభాగంలో పోటీ పడిన 21 ఏళ్ల అజయ్ స్నాచ్‌లో 149 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కిలోలు ఎత్తి మొత్తం 330 కిలోలతో రెండో స్థానంలో నిలిచాడు. మలేషియాకు చెందిన ఎర్రీ హిదాయత్ మొత్తం 331 కిలోలు ఎత్తి స్వర్ణ పతకం సాధించగా, అజయ్ ఒక్క కిలో తేడాతో పసిడి అవకాశాన్ని కోల్పోయాడు. అయినప్పటికీ అతడి ప్రదర్శనపై క్రీడా అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.మహిళల వెయిట్‌లిఫ్టింగ్‌లో కూడా భారత అథ్లెట్లు సత్తా చాటారు. 53 కిలోల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం సాధించింది. స్నాచ్‌లో 88 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోలు ఎత్తిన ఆమె మొత్తం 199 కిలోలతో రెండో స్థానంలో నిలిచింది. నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల 58 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో వింద్యారాణి దేవి కాంస్య పతకం సాధించింది. మొత్తం 199 కిలోల బరువు ఎత్తి మూడో స్థానంలో నిలిచిన ఆమె భారత ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది. ఈ విభాగంలో నైజీరియాకు చెందిన రఫియాత్ ఫోలాషాడే లావల్ 229 కిలోలతో స్వర్ణం సాధించగా, కెనడాకు చెందిన ఆన్ సోఫీ టాషెరో రజత పతకం దక్కించుకుంది.

# అభిషేక్ బలహీనత ప్రత్యర్థులకు తెలిసిపోయింది

### అభిషేక్ శర్మపై కృష్ణమాచారి శ్రీకాంత్ వ్యాఖ్యలు




అభిషేక్ శర్మ .. ఐపీఎల్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున మెరుపులు మెరిపించి, ఆపై భారత్ తరపున కూడా సత్తాచాటిన ఈ ప్లేయర్ ప్రస్తుతం ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. యూకే టూర్ సహా.. ఇటీవల జింబాబ్వే పర్యటనలోనూ అతడు ఆశించిన మేర రాణించలేకపోయాడు. దీంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. 2-3 మ్యాచ్‌లలో సరిగ్గా ఆడలేదనే కారణంతా టీ20 ప్రపంచకప్ 2026 హీరో సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తప్పించినప్పుడు.. అభిషేక్‌కు ఎందుకు మినహాయింపు ఇస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇదే విషయంపై టీమిండియా మాజీ చీఫ్ సెలక్టర్ కృష్ణ మాచారి శ్రీకాంత్ స్పందించారు. అభిషేక్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని క్రిస్ శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. "టీ20 ప్రపంచ కప్ 2026 నుంచే ప్రత్యర్థులు అభిషేక్ శర్మ ఆట తీరును పసిగట్టేశారు. అతడి బలహీనతను గుర్తించి, ఎలా కట్టడి చేయాలో తెలుసుకున్నారు. పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్న అభిషేక్ విషయంలో సెలక్టర్లు కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నాకు అనిపిస్తోంది. సంజూ శాంసన్‌కు మళ్లీ అవకాశం లభిస్తుందని భావిస్తున్నా" అని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇదే సమయంలో మయాంక్ యాదవ్‌పై ఆయన ప్రశంసలు కురిపించారు. "మయాంక్ యాదవ్ 3 మ్యాచ్‌లు ఆడటం బాగుంది. అతడి గురించి నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కుర్రాడు నిలకడగా రాణిస్తాడనే నమ్మకం ఉంది. అతనికి భారత క్రికెట్‌లో ఉజ్వల భవిష్యత్ ఉంది. అశోక్ శర్మ కూడా రాణిస్తున్నాడు. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు భారత టీమ్ మేనేజ్‌మెంట్ అండగా ఉండాలి" అని క్రిస్ శ్రీకాంత్ వివరించారు.



# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాలు, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం మార్కెట్ సూచీలపై ప్రభావం చూపింది. ఎఫ్‌ఎంసీజీ, బ్యాంక్ స్టాక్స్ ఒత్తిళ్లకు లోనయ్యాయి. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 69.86 పాయింట్లు కోల్పోయి 76,765.92 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.60 పాయింట్లు నష్టపోయి 23,985.35 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.84 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో టీసీఎస్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, టైటాన్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి.హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్, బీఈఎల్, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ, పవర్‌గ్రిడ్, రిలయన్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 86.18 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,021.89 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఇన్‌స్టా మార్ట్ సీఈఓ రాజీనామా..

# అమాంతం పెరిగిన స్విగ్గీ షేర్లు

ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన క్విక్‌కామర్స్ విభాగం ఇన్‌స్టా మార్ట్ షేర్లు మంగళవారం అమాంతం పెరిగాయి. కంపెనీ ప్రస్తుత సీఈఓ అమితేశ్ కుమార్ ఝా రాజీనామానే ఇందుకు కారణం. తక్షణమే ఇది అమల్లోకి రానుంది. ఆగస్టు 3 నుంచి తదుపరి సీఈఓగా నందిత సిన్హా కొనసాగనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. సీఈఓ రాజీనామాతో స్విగ్గీ షేరు 0.03శాతం ఫ్లాట్‌గా రూ.257.90 వద్ద ప్రారంభమవ్వగా.. ఇంట్రాడేలో రూ.273 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ట్రేడింగ్‌లో 5శాతం మేర షేర్లు లాభపడ్డాయి. 2.05 గంటల సమయంలో బీఎస్ఈలో షేరు ధర రూ.268.27 వద్ద కొనసాగుతోంది. "ఇన్ స్టామార్ట్ వృద్ధికి అమితేశ్ విలువైన నాయకత్వం అందించారు. జులై 28న ఆయన కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తక్షణమే ఇది అమల్లోకి వస్తుంది. కంపెనీ బలోపేతానికి కృషి చేస్తాం. కాంట్రిబ్యూషన్ మార్జిన్ క్రమంగా మెరుగుపరుస్తాం" అని కంపెనీ ప్రకటించింది. కాగా, తదుపరి సీఈఓ నందిత సిన్హా గతంలో ఇ-కామర్స్ సంస్థలైన ఫ్లిప్‌కార్ట్, ఎఫ్‌ఎంసీజీ వంటి సంస్థలకు తన నాయకత్వాన్ని అందించారు.

# కళ్యాణలక్ష్మి -- షాదీ ముబారక్ పథకాలలో నకిలీ ధృవీకరణ పత్రాల వ్యవహారం ఛేదన

**ముగ్గురు నిందితుల అరెస్ట్ -- నకిలీ అధికారిక రబ్బరు ముద్రలు, కంప్యూటర్ పరికరాలు, డిజిటల్ ఆధారాలు స్వాధీనం**

**ప్రభుత్వ సంక్షేమ పథకాల దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.**






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

జిల్లా ఎస్పి యం.రాజేష్ చంద్ర ఐపిఎస్ వెల్లడి తేదీ. 22.07.2026 నాడు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, కామారెడ్డిలో ఆర్ఎంఓ గా విధులు నిర్వహిస్తున్న డా. చందారి సంతోష్ తన పేరుతో మరియు అధికారిక హోదాతో జారీ చేసినట్లుగా కనిపించే వయస్సు ధృవీకరణ పత్రాలు, మొదటి వివాహ ధృవీకరణ పత్రాలపై తనకు ఎలాంటి సంబంధం లేకుండా నకిలీ సంతకాలు చేయడంతో పాటు తన అధికారిక రబ్బరు ముద్రను దుర్వినియోగం చేసి, వాటిని కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఆర్థిక సహాయం పొందేందుకు ఉపయోగిస్తున్నారని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో, కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి, ఎస్సై మరియు పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా రెండు దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి, కేసును అన్ని కోణాల్లో సాంకేతికంగా విచారించారు. ప్రభుత్వ వైద్యాధికారుల సంతకాలు, అధికారిక రబ్బరు ముద్రలను నకిలీగా ఉపయోగిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు సిద్ధం చేస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు సంబంధిత పత్రాలు, డిజిటల్ రికార్డులు, సాంకేతిక ఆధారాలు మరియు ఇతర సమాచారాన్ని సేకరిస్తూ విస్తృత దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తులో లభించిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు భిక్కనూర్ గ్రామంలోని లహరి జిరాక్స్ అండ్ ఆన్‌లైన్ సెంటర్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఈ నేరంలో ప్రమేయం ఉన్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని, విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నారు.కేసు వివరలోకెళ్తేదర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ప్రధాన నిందితులు తోడెంగల రాజా నరేందర్, తోడెంగల రాజలింగం భిక్కనూర్‌లో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ సేవా కేంద్రం ద్వారా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తుల నుంచి వివాహ పత్రికలు, ఆధార్ కార్డులు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు మరియు ఇతర అవసరమైన పత్రాలను సేకరించి, ప్రతి దరఖాస్తుకు రూ. 4,500 నుంచి రూ. 5,000 వరకు సేవా రుసుము వసూలు చేసేవారు.

అనంతరం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న బోయిని ప్రసాద్తో కుమ్మక్కై, ప్రభుత్వ వైద్యాధికారుల అసలు సంతకాలు పొందకుండా వారి పేర్లతో నకిలీ సంతకాలు చేసి, నకిలీ అధికారిక రబ్బరు ముద్రలు వేయించి వయస్సు ధృవీకరణ పత్రాలు, మొదటి వివాహ ధృవీకరణ పత్రాలు మరియు ఇతర అవసరమైన ధృవీకరణ పత్రాలను తయారు చేసేవారు. వాటిని అసలైన ప్రభుత్వ పత్రాలుగా చూపిస్తూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అక్రమంగా పొందే విధంగా వ్యవహరించినట్లు నిందితుల కంప్యూటర్‌లో నిర్వహించిన పరిశీలన ద్వారా వెల్లడైనది.నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ వ్యవహారంలో అక్రమంగా సమర్పించిన దరఖాస్తుల సంఖ్య, ప్రభుత్వానికి జరిగిన ఆర్థిక నష్టం, సంబంధిత లబ్ధిదారుల వివరాలు, ఈ నేరంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

స్వాదినపు వివరాలు : నిండుతుల వద్ద నుండి నేరానికి ఉపయోగించిన కంప్యూటర్ జూఖ, ాజణ మానిటర్, కీబోర్డ్, మౌస్, మూడు మొబైల్ ఫోన్లు, నకిలీ అధికారిక రబ్బరు ముద్రలు, స్టాంప్ ప్యాడ్, నకిలీ సంతకాలకు ఉపయోగించిన పెన్నులు, కంప్యూటర్‌లో భద్రపరిచిన దరఖాస్తుల డిజిటల్ రికార్డులు మరియు ఇతర నేర సంబంధిత వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సాంకేతిక ఆధారాల సహాయంతో చాకచక్యంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐ.పి.ఎస్. అభినందించడం జరిగినది.

# సహజ వ్యవసాయ క్షేత్రంలో ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థుల అధ్యయన యాత్ర

రైతు శ్రమను ప్రత్యక్షంగా తెలుసుకున్న ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు సహజ సాగు విధానాలపై విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన

**నీలగిరి వార్త ప్రతినిధి షాద్ నగర్ జులై 28**



షాద్‌నగర్: విద్యార్థుల్లో ప్రకృతి వ్యవసాయం, రైతుల శ్రమ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు మంగళవారం కేశంపేటలోని సహజ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్థానిక రైతులు విద్యార్థులకు వ్యవసాయం ప్రాముఖ్యతతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు.పర్యటనలో భాగంగా విద్యార్థులు గానుగ ద్వారా సాంప్రదాయ నూనె తయారీ, వర్షపు నీటి సంరక్షణ పద్ధతులు, గోబర్ గ్యాస్ ప్లాంట్ పనితీరు, దేశీ ఆవుల పెంపకం, ఫుడ్ ఫారెస్ట్, ఫైవ్-లేయర్ సాగు విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సహజ వ్యవసాయం ద్వారా భూమి సారాన్ని కాపాడడంతో పాటు పర్యావరణ సమతుల్యతను పరిరక్షించవచ్చని తెలుసుకున్నారు.వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడంలో సహజ వ్యవసాయ పద్ధతులు ఉపయోగకరమని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ క్షేత్ర సందర్శన తమకు వ్యవసాయంపై కొత్త అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో రైతు పాత్ర ఎంత గొప్పదో తెలియజేసిందని వారు పేర్కొన్నారు.

# మెరుగైన వైద్యం కొరకు 1,50,000 ఎల్ఓసిని అందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

**నీలగిరి వార్త ప్రతినిధి షాద్ నగర్ జులై 28**



షాద్ నగర్ పట్టణంలోని రామ్ నగర్ కాలనీ కి చెందిన ఓరగంటి ముత్యాలు అత్యవసర వైద్య సహాయార్థం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని సహాయం కోరక స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మెరుగైన వైద్య చికిత్స కొరకు తన సిఫారసుతో 1,50,000 ఎల్ఓసిని మంజూరు చేయించారు.ఈ సందర్భంగా లబ్ధిదారునికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయం షాద్ నగర్ కౌన్సిలర్ వాణి పాండురంగారెడ్డి మాజీ కౌన్సిలర్ నందకిషోర్ చేతుల మీదుగా లబ్ధిదారునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు ఓరగంటి రవీందర్,ఎల్లయ్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 71 మందికి కోర్టు శిక్షలు

81,500 జరిమానా విధింపు

10 మందికి ఒక రోజు జైలు, 3 మందికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా



జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై దృష్టి సారించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ కఠిన చర్యలు చేపడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 71 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా, వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు ?81,500 జరిమానా విధించింది. అదేవిధంగా 10 మందికి ఒక రోజు జైలు శిక్ష, 3 మందికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమైన చర్య అని తెలిపారు. మద్యం ప్రభావంలో డ్రైవింగ్ చేయడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని, క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపానికి కారణమవుతుందని అన్నారు. ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.మద్యం సేవించి వాహనం నడపడం నేరం. మీ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల భద్రత కోసం కూడా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించండి.



# పక్షులు -- పర్యావరణ స్పృహపై సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా "పక్షులు -- పర్యావరణ స్పృహ" అంశంపై సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.మంగళవారం దోమకొండ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి పర్యావరణ స్పృహను పెంపొందించుకుని ప్రకృతి, పక్షుల సంరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. పక్షులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం, మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు.సంఖ్యాశాస్త్రాన్ని నిత్య జీవితంలో అన్వయించుకునే విధంగా నేర్చుకోవాలని, పదో తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, ప్రయోగశాలలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వంటగదిలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మరుగుదొడ్లను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రయోగశాలల్లో అందుబాటులో ఉన్న పరికరాలను సక్రమంగా వినియోగిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, విద్యాశాఖ సమన్వయకర్త వేణుగోపాల్, మండల విద్యాశాఖాధికారి విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్. ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రీ--సర్వే పరిశీలనపారదర్శకంగా పూర్తి చేయాలి: ఆర్డీఓ శ్రీదేవి



**గట్టుప్పల్, నీలగిరి వార్తా ప్రతినిధి,జూలై 28:**

జిల్లాల సరిహద్దు గ్రామాల్లో చేపడుతున్న రీ--సర్వే పనులను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి అధికారులను ఆదేశించారు. గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామంలో కొనసాగుతున్న రీ--సర్వే కార్యక్రమాన్ని ఆమె మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లొయపల్లి, నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామాల మధ్య ఉన్న జిల్లా, గ్రామ సరిహద్దులను పరిశీలించి హద్దు రాళ్లు, రికార్డులను తనిఖీ చేశారు.సరిహద్దు గుర్తులను కచ్చితంగా నమోదు చేయాలని, గ్రామాల హద్దులు స్పష్టంగా నమోదయ్యేలా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సర్వే బృందానికి సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి సరిహద్దు వివాదాలకు తావులేకుండా రీ--సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కె. రాములుతో కలిసి సరిహద్దు ప్రాంతాలను సందర్శించిన ఆర్డీఓ, రీ--సర్వే పనుల పురోగతిపై ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి, రికార్డులను పకడ్బందీగా సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొనే కాలానుగుణ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వివిధ శాఖల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించారు.అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్యం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ తదితర శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధంగా ఉంచి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వర్షాభావం లేదా ఇతర ప్రతికూల పరిస్థితులు తలెత్తిన సందర్భంలో వెంటనే స్పందించే విధంగా శాఖలన్నీ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.

# ప్రమాదకరంగా మారిన బీబీపేట్ రోడ్డు వంతెన

కొత్త బ్రిడ్జి మంజూరు చేయాలి. మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ నర్సింలు.

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**



కామారెడ్డి జిల్లా బిబిపేట్ మండల కేంద్రంలోని ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి గత వర్షాకాలంలో కూలిన వంతెన. రోడ్డుని మళ్లీ వర్షాకాలం వచ్చింది పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళలో చాలా యాక్సిడెంట్లు కూడా అవుతున్నాయి. అయినా ఎలాంటి స్పందన లేని అధికారులు నాయకులు. ప్రభుత్వాలు ప్రతి దానిని రాజకీయాలు చేయకండి. మాకు రాజకీయ నాయకులకు సంబంధం లేదు. మళ్లీ ఎన్నికలు వచ్చేంతవరకు వేచి చూడాలా ఇలాంటి ప్రభుత్వాలు ఉన్నా లేకున్నా ఒక్కటే. ప్రభుత్వాల పట్ల చాలా పెద్ద ఎత్తున వ్యతిరేకత చూపించాల్సి వస్తుంది. నాయకులు అధికారులు స్పందించరా బీబీపేట నాలుగు జిల్లాల కూడలి కామారెడ్డి సిద్దిపేట సిరిసిల్ల మెదక్ వీళ్లు అందరూ ఇదే రోడ్డుపైన ప్రయాణం చేస్తారు. అట్లాంటి రోడ్డును మీరు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కొరివి నర్సింలు ముదిరాజ్ బీబీపేట్ గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# ఫారెస్ట్ అధికారుల వేధింపులు తట్టుకోలేక పురుగుల మందు తాగి గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త :**



ఫారెస్ట్ అధికారుల వేధింపు తట్టుకోలేక రాజంపేట మండలం షేర్ శంకర్ తండా గిరిజన రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సిపిఎం నాయకులు పరామర్శించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కే .చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారి జయశ్రీ వేధింపులు తట్టుకోలేకనే గిరిజన రైతు పురుగుల మందు తాగిందని ఫారెస్ట్ అధికారులు బహిరంగంగానే గిరిజన రైతులను చనిపోమని చెప్పడం బెదిరించడం సిగ్గుచేటని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అంబానీ అదానిలకు వేల ఎకరాల భూమి రూపాయి లేకుండా లీజుకు ఇస్తే మొత్తం అడవుల్ని ధ్వంసం చేస్తున్న పట్టించుకోని బిజెపి ప్రభుత్వం తండాలలో గ్రామాలలో ఒక ఎకరం రెండెకరాలు బతుకుతెరువు కోసం వ్యవసాయం కోసం సాగు చేసుకుంటే దుర్మార్గంగా దాడులకు పాల్పడుతోందని కేసులు పెడతామని బెదిరిస్తుందని ఇకనైనా ఫారెస్ట్ అధికారుల వేధింపులు ఆపకపోతే జిల్లా ఫారెస్ట్ కార్యాలయాన్ని గిరిజనులోని ఏకం చేసి ముట్టడిస్తామని హెచ్చరించారు. బెదిరింపులకు గురిచేసిన ఫారెస్ట్ అధికారి జయశ్రీని సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు, ముదాం అరుణ్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో భారీ వర్షం

రైతుల్లో ఆనందం పట్టణంతో పాటు పాటు జిల్లా వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తోంది.



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

పట్టణంతో పాటు పాటు జిల్లా వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి అలుముకున్న నల్లని మేఘాల నేపథ్యంలో దాదాపు అరగంట పాటు ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు.

గత కొన్ని రోజులుగా వర్షాలు లేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. వరి, మొక్కజొన్న, పత్తి పంటలు వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షంతో పొలాలకు నీళ్లు అందనున్నాయి. మళ్లీ దుక్కి దున్నుకునే అవకాశం లభించింది. భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో బోర్లపై ఆధారపడిన రైతుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి. భారీ వర్షం రైతులకు లాభం చేకూర్చినా, కామారెడ్డి పట్టణ ప్రజలకు మాత్రం చుక్కలు చూపించింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. బస్ స్టాండ్, గాంధీ చౌక్, రాజీవ్ రహదారి వద్ద భారీగా నీరు నిలిచింది. డ్రైనేజీలు పొంగడంతో మురికి నీరు రోడ్లపైకి వచ్చింది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని లోతట్టు కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరినట్టుగా తెలుస్తోంది.